వైఎస్సార్ కళ్యాణమస్తు..
వైఎస్సార్ షాదీ తోఫా..
30 సెప్టెంబర్, 2022 న పథకం వెబ్‌సైట్ ను ప్రారంభించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..
1 అక్టోబర్, 2022 న పథకం ప్రారంభం..

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి fb.com/vaartha

PUBLISHED FROMTIRUPATHI, VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

1-10-2022 శనివారం సంపుటి : 28 సంచిక : 242, పేజీలు : 10+4 వెల : 6.50

వైఎస్సార్ కళ్యాణమస్తు.. వైఎస్సార్ షాదీ తోఫా..
పేద తల్లిదండ్రులు వారి కుమార్తెల వివాహాన్ని గౌరవప్రదంగా జరుపుకునేందుకు ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు "వైఎస్సార్ కళ్యాణమస్తు" ద్వారా, ముస్లిం మైనార్టీలకు "వైఎస్సార్ షాదీ తోఫా" ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

## చదువులను ప్రోత్సహించేందుకు జగనన్న ప్రభుత్వం వేస్తున్న మరో అడుగు..

దసరా శుభాకాంక్షలతో..

జగనన్న ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన 98.44% హామీలు అమలు చేశాం, చేస్తున్నాం JAGANANNA GOVERNMENT

మేనిఫెస్టోలో ఇచ్చిన మరో హామీని అమలు పరుస్తూ..

## వైఎస్సార్ కళ్యాణమస్తు

## వైఎస్సార్ షాదీ తోఫా

30 సెప్టెంబర్, 2022 న పథకం వెబ్‌సైట్ ను ప్రారంభించిన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ. వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి..
1 అక్టోబర్, 2022 న పథకం ప్రారంభం..

## పిల్లల చదువు ఇంటికి వెలుగు – ఇల్లాలి చదువు వంశానికే వెలుగు..



శ్రీ వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

పేద తల్లిదండ్రులు వారి పిల్లలను చదివించి వారి వివాహాన్ని గౌరవ ప్రదంగా జరిపించి తమ సామాజిక బాధ్యత నిర్వర్తించేందుకు అండగా నిలుస్తూ.. ఎస్.సి, ఎస్.టి, బి.సి, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు "వైఎస్సార్ కళ్యాణమస్తు" ద్వారా, ముస్లిం మైనార్టీ వర్గాల ఆడపిల్లలకు "వైఎస్సార్ షాదీ తోఫా" ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్న జగనన్న ప్రభుత్వం..

### వధూవరులిరువురుకీ 10th క్లాస్ ఉత్తీర్ణత తప్పనిసరి..

పిల్లల చదువును ప్రోత్సహించడం.. బాల్య వివాహాలను నివారించడం.. పాఠశాలల్లో చేరికల శాతాన్ని పెంచడం.. డ్రాపౌట్ రేట్‌ను తగ్గించడం.. లక్ష్యాలుగా "వైఎస్సార్ కళ్యాణమస్తు", "వైఎస్సార్ షాదీ తోఫా".. లబ్ధిదారైన వధువు, ఆమెను వివాహం చేసుకునే వరుడు తప్పనిసరిగా పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి, వివాహ తేదీ నాటికి వధువు వయస్సు 18, వరుడి వయస్సు 21 ఏళ్లు ఖచ్చితంగా నిండాలన్న నిబంధనలు పై పథకాల ద్వారా అమలు చేస్తున్న జగనన్న ప్రభుత్వం..

**గత ప్రభుత్వం**లో అరకొరగా కొన్ని వర్గాలకే ఆర్థిక సాయం.. అదీ సకాలంలో అందరికీ అందని వైనం.. సాయం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దైన్యం.. అర్హులైన లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ నెలల తరబడి జాప్యం చేసి 2018 నుండి ఈ పథకాన్ని ఎత్తివేసిన దుస్థితి.. 2018-19 సంవత్సరంలో ఏకంగా 17,709 లబ్ధిదారులకు రూ. 68.68 కోట్ల వివాహ ప్రోత్సాహకాలను చెల్లించకుండా ఎగ్గొట్టిన పరిస్థితి..

- మరి మన జగనన్న ప్రభుత్వంలో లంచాలకు, వివక్షకు తావు లేకుండా, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే దుస్థితి లేకుండా గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా అత్యంత పారదర్శకంగా "వైఎస్సార్ కళ్యాణమస్తు/వైఎస్సార్ షాదీ తోఫా"ల క్రింద అర్హులందరికీ సంతృప్త స్థాయిలో లబ్ధి..
- పేదల ఇంట్లో పెళ్లి కూడా ఆనందాల అనుభూతులను మిగిల్చేలా, గత ప్రభుత్వంలో అందిస్తామని ఎగ్గొట్టిన సాయానికి దాదాపు రెట్టింపు ఆర్థికసాయం..

## జగనన్న ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం వెనుక ఎంతో దూరదృష్టి ఉంది..! భవిష్యత్ గురించి ఆలోచన ఉంది..!! ప్రస్తుత అవసరాలు తీర్చడంతో పాటు భావి తరాలకూ మంచి జరగాలన్న తపన ఉంది..!!!

పాఠశాలల్లో పిల్లల నమోదు శాతం పెంచడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి వారి బంగారు భవిష్యత్ కు బాటలు వేయడమే లక్ష్యంగా విద్యా రంగంలో జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న వినూత్న పథకాలు..

- ఒకవైపు పిల్లలను బడికి పంపించేలా తల్లులను ప్రోత్సహిస్తూనే, మరోవైపు డ్రాపౌట్ రేట్ తగ్గించడమే లక్ష్యంగా 75 శాతం హాజరు నిబంధనతో "జగనన్న అమ్మఒడి" ద్వారా తల్లులకు ఏటా రూ. 15,000 ఆర్థిక సాయం..
- "నాడు-నేడు" లో స్కూళ్ళ అభివృద్ధి చేయడమేగాక పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు చిరకాలం నిలబడాలని, పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని "అమ్మఒడి" నిధుల నుండి స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్(SMF), టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్(TMF) ఏర్పాటు చేయడంతో పాటు నిర్వహణ బాధ్యతల్లో తల్లిదండ్రులను భాగస్వామ్యులను చేయడంతో వారికి ప్రశ్నించే హక్కు కల్పిస్తున్నాం..
- పాఠశాలల్లో టాయిలెట్ వసతి లేని కారణంగా బాలికల్లో డ్రాపౌట్ రేట్ ఎక్కువగా ఉండటం గమనించి దాన్ని తగ్గించడం కోసం నాడు-నేడు క్రింద పాఠశాలల్లో బాలికలకు ప్రత్యేక టాయిలెట్ల నిర్మాణం.. "స్వేచ్ఛ" పథకం ద్వారా 7వ తరగతి నుండి 12వ తరగతి వరకు చదువుతున్న ఆడపిల్లలకు ఉచితంగా శానిటరీ నాప్‌కిన్ ల పంపిణీ..
- "జగనన్న గోరుముద్ద" ద్వారా ప్రతి రోజూ మెనూ మార్చి పిల్లలకు నాణ్యమైన, రుచికరమైన, మెరుగైన పౌష్టికాహారం..
- తల్లిదండ్రులపై ఆర్థికభారం పడకుండా, దాని వల్ల డ్రాపౌట్ ల సంఖ్య పెరగకుండా ఉండేందుకు పాఠశాల తెరిచిన రోజునుండే "జగనన్న విద్యాకానుక" ద్వారా బైలింగువల్ పాఠ్యపుస్తకాలు (ఒక పేజీ తెలుగు, మరో పేజీ ఇంగ్లీషులో), నోట్ బుక్స్, యూనిఫాంతో సహా 9 వస్తువులతో కూడిన కిట్ ఉచితంగా అందజేత..
- మన విద్యార్థినీ, విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రాథమిక విద్య నుంచే పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన.. సీబీఎస్ఈతో సిలబస్ అనుసంధానం..
- ప్రపంచ స్థాయిలో పోటీ పడేలా మన పిల్లలను సన్నద్ధం చేసేందుకు 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఏటా రూ. 24 వేల విలువైన, శ్రీమంతుల పిల్లలకు మాత్రమే అందుబాటులో ఉన్న బైజూస్ స్టడీ మెటీరియల్.. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే పిల్లలకు, బోధించే ఉపాధ్యాయులకు ఈ ఏడాది నవంబర్‌లో, ఇకనుంచి ప్రతి ఏడాదీ "జగనన్న విద్యాకానుక"లో భాగంగా రూ. 16 వేలు విలువ చేసే ట్యాబ్ లు ఉచితంగా అందజేత...
- కాలేజీల్లో జవాబుదారీతనం పెరిగేలా, తల్లులకు ప్రశ్నించే హక్కు కల్పిస్తూ పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్ పథకంగా "జగనన్న విద్యాదీవెన", భోజన, వసతి ఖర్చుల కోసం "జగనన్న వసతి దీవెన" క్రింద తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసి వారి ద్వారా కాలేజీలకు చెల్లింపు.. కరికులమ్ లో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను తీసుకురావడం, ఆన్ లైన్ వర్టికల్స్, ఇంటర్న్‌షిప్ లు...
- మరి ఇప్పుడు మరో అడుగు ముందుకు వేస్తూ వైఎస్సార్ కళ్యాణ మస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా పిల్లల చదువును మరింత ప్రోత్సహించేలా చర్యలు..

### సత్ఫలితాలందిస్తున్న మన ప్రభుత్వ విద్యా సంస్కరణలు

- గత పాలకుల హయాంలో విద్యారంగాన్ని నిర్లక్ష్యంచేసిన కారణంగా 2018లో కేంద్ర మానవ వనరుల శాఖ ఇచ్చిన నివేదిక ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల చేరిక (జీఈఆర్) రాష్ట్రంలో కేవలం 84.48% గా నమోదైన దుస్థితి.. మన ప్రభుత్వం విద్యా రంగంలో చేపట్టిన విప్లవాత్మక కార్యక్రమాల ఫలితంగా 2021 నాటికి మన రాష్ట్రంలో పాఠశాలల్లో విద్యార్థుల చేరిక (జీఈఆర్) 102.97% కి చేరింది..
- 2018-19 సంవత్సరాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుండి 10వ తరగతి వరకు 37.21 లక్షలుగా ఉన్న విద్యార్థుల సంఖ్య 7 లక్షలు పెరిగి 2021-22 నాటికి 44.30 లక్షలకు చేరింది. అదే సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 2 లక్షలకు పైగా పెరిగి 72.47 లక్షలకు చేరడం గమనార్హం.
- సెంటర్ ఫర్ బడ్జెట్ అండ్ గవర్నెన్స్ అకౌంటబిలిటీ & సేవ్ ది చిల్డ్రన్ ఫౌండేషన్ నివేదిక ప్రకారం 2020-21లో అంగన్‌వాడీ చదువుల కోసం భారతదేశం జీడీపీ లో 0.1 శాతం, అంటే ఒక్కో చిన్నారికి దేశంలో సగటున రూ. 8, 297 మాత్రమే ఖర్చు చేయగా, మన ప్రభుత్వం ఒక్కొక్క చిన్నారిపై జాతీయ సగటు కన్నా దాదాపు రెట్టింపు మొత్తం రూ. 15,152 ఖర్చు చేస్తూ దేశంలోనే అత్యధికంగా ఖర్చు చేసే రాష్ట్రాల సరసన నిలిచింది..

సలహాలు, సూచనలు, ఫిర్యాదుల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ **1902**

## తేడా గమనించండి..!

| క్రమ సంఖ్య | కేటగిరీ | గత ప్రభుత్వం అందిస్తామని ఎగ్గొట్టిన ఆర్థిక సాయం (రూ.లలో) | వైఎస్సార్ కళ్యాణ మస్తు / వైఎస్సార్ షాదీ తోఫా క్రింద మన ప్రభుత్వం అందిస్తున్న సాయం (రూ.లలో) |
|---|---|---|---|
| 1 | ఎస్.సి | 40,000 | 1,00,000 |
| 2 | ఎస్.సి (కులాంతర వివాహం) | 75,000 | 1,20,000 |
| 3 | ఎస్.టి | 50,000 | 1,00,000 |
| 4 | ఎస్.టి(కులాంతర వివాహం) | 75,000 | 1,20,000 |
| 5 | బి.సి | 35,000 | 50,000 |
| 6 | బి.సి(కులాంతర వివాహం) | 50,000 | 75,000 |
| 7 | మైనార్టీలు | 50,000 | 1,00,000 |
| 8 | విభిన్న ప్రతిభావంతులు | 1,00,000 | 1,50,000 |
| 9 | భవన, ఇతర నిర్మాణ కార్మికులు, | 20,000 | 40,000 |

## దరఖాస్తు చేసుకునే విధానం...

- అక్టోబర్ 1వ తేదీ నుండి పథకం అమలు.. అర్హులైన పేదలందరూ గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా వైఎస్సార్ కళ్యాణమస్తు / వైఎస్సార్ షాదీ తోఫా పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చు..
- ఈ పథకం క్రింద లబ్ధి పొందడానికి వధూవరులిద్దరికీ ఇది తొలి వివాహమై ఉండాలి.. వితంతు పునర్వివాహాన్ని ప్రోత్సహించేలా సదరు అక్కచెల్లెమ్మలకు ఈ నిబంధన నుండి మినహాయింపు..
- వధూవరులు వివాహమైన 60 రోజుల లోపు తమ దగ్గర్లోని గ్రామ/వార్డు సచివాలయాన్ని సంప్రదించాలి.. వివాహ ధృవీకరణ పత్రాన్ని సచివాలయంలో ధరఖాస్తు చేసుకుని పొందవచ్చు..
- గ్రామ/వార్డు సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ /వార్డు వెల్ఫేర్ & డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ లను కలిసి లేదా వాలంటీర్ సహాయంతో వివాహ ధృవీకరణ పత్రం, పెళ్లి ఫొటోలు, వధూవరుల పదవ తరగతి పాస్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు తదితర అవసరమైన డాక్యుమెంట్‌లు అందజేస్తే, వారు నవశకం బెనిఫిషియరీ మేనేజ్‌మెంట్ పోర్టల్‌లో పత్రాలను అప్‌లోడ్ చేసి దరఖాస్తును ప్రాసెస్ చేయడంతో పాటు అర్హులందరికీ లబ్ధి అందేలా సహకరిస్తారు.
- సంబంధిత అధికారులు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి వివరాలను ధృవీకరించుకుని ప్రతి ఏడాది త్రైమాసికానికి ఒకసారి చొప్పున జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ లలో ఆ త్రైమాసికానికి సంబంధించిన అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందిస్తారు..
- పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు నవశకం బెనిఫిషియరీస్ మేనేజ్‌మెంట్ పోర్టల్ https//gsws-nbm.ap.gov.in/ వెబ్ సైట్ లో పొందవచ్చు..

శ్రీ. మేరుగ నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

PUBLISHED FROM TIRUPATHI, NELLORE VIJAYAWADA, HYDERABAD, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, , NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

1-10-2022 శనివారం సంపుటి : 28 సంచిక : 242, పేజీలు : 10+4 వెల : 6.50


# ఆరోగ్యశ్రీలోకి మరిన్ని చికిత్సలు

## 15 నుంచి 3254 చికిత్సావిధానాలు అందుబాటులోకి

## ప్రభుత్వాసుపత్రుల్లో డైట్ చార్జీలు పెంపు: సిఎం జగన్

## ఆరోగ్యశ్రీకి యేడాదికి రూ.2500కోట్లు

## ఆరోగ్య ఆసరాకు రూ.300 కోట్లు

## రాష్ట్రానికి ఆరు ఆయుష్మాన్ భారత్ అవార్డులు



**విజయవాడ,సెప్టెంబరు30.ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉండి చికిత్స పొందుతున్న రోగులకు ఆహారఖర్చు(డైట్ చార్జీ)లు పెంచుతున్నట్లు ఏపీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి తెలిపారు.ఆరోగ్య శ్రీ పరధిలోని రోగులకు అందిస్తున్నట్లే వారికి డైట్ చార్జీలు పెంచి ఇస్తామని తెలిపారు.ప్రస్తుతమిస్తున్న ఆహార ఖరు ్చకు తోడు మరో రూ.100 అదనంగా ఇస్తామన్నారు.విలేజీ క్లినిక్‌ల్లో 12 రకాల వ్యాధి నిర్ధారణ కిట్లు,67రకాల మందులు అందుబాటులో ఉంచు తామన్నారు.అంతేకాకుండా ఇప్పటికే ప్రతి విలేజీ క్లినిక్ పరిధిలో కోవిడ్ వ్యాధి నిర్ధారణ కిట్ అందుబాటులో ఉంటుందన్నారు.వ్యాధి నియంత్రణ మందులుంటాయన్నారు. ప్రభుత్వం ఆరోగ్యశ్రీ అను బంధ సేవల కింద ఏడాదికి రూ.2500కోట్లు వ్యయం చేస్తుం దన్నారు.ఆరోగ్య ఆసరాకు రూ.300కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. 108.104 అత్యవసర వైదసేవల సంచార వాహనాలకు రూ.400 కోట్లు వ్యయం చేస్తున్నామన్నారు.డిసెంబరు నాటికి సంచార వైద్యాన్ని అందించే 104 వాహనాలను కొత్తగా 432 అందుబా టులోకి తీసుకుని వస్తున్నామన్నారు.ఇప్పుడున్న వాహనాలతో కలిపి మొత్తం1108 సంచార వైద్యవాహనాలు అందుబాటులోకి వస్తాయన్నారు.వైద్య ఆరోగ్యంలో ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలుకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు.ఏపీకి ఆరు ఆయుష్మాన్ భారత్ అవార్డులు లభించాయన్నారు.10 అవా ర్డులుంటే నాలుగు మాత్రమే ఇతర రాష్ట్రాలకు వెళ్ళాయన్నారు.ఇది మనం పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా చేస్తున్న సేవకు లభించిన ప్రశంస అన్నారు.ఆరోగ్యశ్రీ పరిధిలోకి కొత్తగా 750కిపైగా కొత్తగా ప్రొసీజర్లు( చికిత్సా విధానాలు) అదనంగా చేరుస్తున్నట్లు ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తెలిపారు.దీంతో మొత్తంగా ఆరో గ్యశ్రీ కింద 3,254చికిత్సా విధానాలు అందుబాటులోకి వస్తాయ న్నారు. శుక్రవారం వైద్యఆరోగ్యశాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి తాడేపల్లిలోని తన వ్యక్తిగత కార్యాలయంలో కీలక సమీక్షను నిర్వహించారు.ఏపీకి లభించిన ఆయుష్మాన్ భారత్ అవార్డులను ఈ సమావేశంలో మంత్రి రజనీ,అధికారులతో కలిసి సీఎం జగన్ ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ప్రొసీజరులతో కలిపి అక్టోబరు15 నాటికి ఆరోగ్యశ్రీ వైద్యసే వలు అందుబాటులోకి వస్తాయన్నారు.ముందుగా అనుకున్న ప్రకారం అక్టోబరు 5 నాటికే ఈ ప్రొసీజర్లు అమలులోకి రావాల న్నారు.కొన్ని సాంకేతికంశాల కారణంగా జాప్యం జరిగిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్టకుడా ఇదే సమయానికి ప్రారంభమవు తుందన్నారు.నప్రాథమిక ఆరోగ్య వ్యవస్థలో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలులోకి వస్తోందన్నారు.కాబట్టి క్యాన్సర్‌ను గుర్తిం చడం సులువు అవుతుందన్నారు.రా ష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసే 16 వైద్యకళాశాలతో కలిపి మొత్తం 27 మెడికల్ కాలేజీల్లోను క్యాన్సర్ నివారణకు రెండేసీ చొప్పున లైనాక్ మిషన్ ఉండే విధంగా ఉండేలా బ్లూప్రింట్ సిద్ధం చేయాలన్నారు.వీటితో పాటుగా పార్వ తీపురం మన్యం జిల్లాలో వైద్యకళాశాల ఏర్పాటు చేయాల న్నారు. ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కార్యక్రమాలతో పాటుగా గ్రామీణ ప్రాం తాల్లో ఇంటి ముంగిటికి వైద్యసేవలను ≫2



శుక్రవారం గాంధీనగర్‌లో 'వందేభారత్'ఎక్స్‌ప్రెస్‌ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

# 'వందేభారత్'ఎక్స్‌ప్రెస్ ప్రారంభించిన ప్రధాని

## గాంధీనగర్, ముంబయి మధ్య ప్రయాణం

## రైలులో కొంతదూరం ప్రయాణించిన ప్రధాని మోడీ

**గాంధీనగర్ :** ప్రధానమంత్రి నరేంద్రమోడీ గుజరాత్ పర్యటనలో భాగంగా గాంధీనగర్, ముంబయి మధ్య సెమీ హైస్పీడ్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు. ఆ రైలులో కొంతదూరం ప్రయాణించారు. శుక్రవారం ఉదయం గం.10.30 సమయంలో గాంధీనగర్ క్యాపిటల్‌క రైల్వే ≫2




మీడియా సమావేశంలో మంత్రి అమర్నాథ్

# విశాఖలో ఐటి అభివృద్ధికి చర్యలు

## రాష్ట్ర పరిశ్రమల మంత్రి అమర్నాథ్

**ప్రభాతవార్త, విశాఖపట్నం:** విశాఖలో ఐటీ పరిశ్రమల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసు కుంటున్నట్టు రాష్ట్ర ఐటి, భారీ పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. శుక్ర వారం మంత్రి జిల్లా కలెక్టర్, పోలీసు కమి షనర్‌లతో, ఇన్ఫోసిస్ ప్రతినిధులతో కలిసి సిరిపురం ప్రభుత్వ అతిధిగృహంలో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మం త్రి గుడివాడ మాట్లాడుతూ రుషికొండ ఐటి హిల్స్ వరకూ ఉద్యోగుల సౌకర్యార్థం ఎసి బస్సులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉద్యోగుల భద్రత నిమిత్తం రోడ్లలో లైటింగ్, సిసి కెమెరాల ఏర్పాటు, పోలీస్ పెట్రోలింగ్, టాక్సీలకు జిపిఎస్ ఏర్పాటు చేస్తున్నామ న్నారు. శానిటేషన్ నిర్వహణకై జివిఎంసీ తగు చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళా ఉద్యోగినుల భద్రతకై తగు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రవాణా, సెక్యూ రిటీ, హెల్త్‌కేర్ సదుపాయాలు, సిసి కెమె రాలు, ఏర్పాటు శానిటేషన్ ఇంకా అవస రమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పిం చడం జరుగుతుందన్నారు. ఐటి హిల్స్‌కు దగ్గర్లో వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయని, గీతం వైద్య కళాశాల ఆరిలోవ హెల్త్ సిటీ దగ్గర్లో ఉన్నాయన్నారు. ఇన్ఫోసిస్ అధ్యక్షుడు రఘ బొడ్డుపల్లి మాట్లాడుతూ విశాకలో డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే ఏడాది నుంచి ఇక్కడి ఇంజనీరింగ్ విద్యార్థులకు సంస్థకు అనవరమైన రీతిలో శిక్షణ ఇచ్చి తీసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇన్ఫోసిస్ ప్రతినిధులు బి. శ్రీనివాస్ సెక్యూరిటీ హెడ్, ఎ.కులకర్ణి, రీజ నల్ హెడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, వెంకటేష్ సంగం రీజనల్ హెడ్ ఫెసిలిటీస్, ఎన్. సురేష్ డెలివరీ హెడ్, గణేష్ రిజనరల్ మేనేజర్ సెక్యూరిటీ , ఎస్‌డిసి రంగయ్య, జనరల్ మేనేజర్ డిఐసి రామలింగరాజు, రీజనల్ ఆర్టీసీ తదితరులు పాల్గొన్నారు.



# కరోనా సమాచారం

| ప్రపంచంలో |
| --- |
| మొత్తం బాధితులు 62.25 కోట్లు |
| మరణాలు-65.47 లక్షలు |
| **దేశంలో** |
| తాజా కేసులు - 3,938 |
| మరణాలు - 9 |
| **తెలంగాణలో** |
| తాజా కేసులు- 93 |
| మృతులు -0 |

# కాంగ్రెస్ అధ్యక్షబరిలో ముగ్గురు నేతలు

## దిగ్విజయ్ కూడా వెనక్కి

## తెరపైకి మల్లికార్జున ఖర్గే

## శశిథరూర్, త్రిపాఠి నామినేషన్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షపదవికి జరుగుతున్న సంస్థాగత ఎన్నికల్లో నెలకొన్న కోల్డ్‌వార్‌కు తెరపడింది. నిన్న మొన్నటివరకూ రాజస్థాన్ సిఎం అశోక్‌గెహ్లోత్‌పేరు ప్రముఖంగా వినవచ్చింది. అయితే జోడుపదవుల సంస్కృతికి స్వస్తిచెప్పాలని, ఒక వ్యక్తికి ఒకేప



మల్లిఖార్జున ఖర్గే, త్రిపాఠి, శశిథరూర్

దవి అన్న సిద్ధాంతాన్ని అమలుచేయడంతో రాజస్థాన్ సీఎం పదవిని వదులుకునేందుకు గెహ్లోత్ ఇష్టపడలేదు. దీనితో ఆయన అధ్యక్ష ఎన్నిక రేసునుంచి తప్పుకున్నారు. అలాగే మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దిగ్విజయ్‌సింగ్‌సైతం రేసునుంచి తప్పుకుంటున్నట్లుప్రకటించారు. తాజాగా ఇపుడు కేరళ కాంగ్రెస్ సీనియర్‌నేత శశిథరూర్; రాజ్యసభ విపక్షనేత కేంద్ర మాజీ మంత్రి మల్లిఖార్జున్‌ఖర్గే, కెఎన్ త్రిపాఠిలు మాత్రమే రేసులో ఉన్నారు. నామినేషన్ల దాఖలుకు శుక్రవారం తుదిగడువు కావడంతో ముగ్గురు నాయకులు తమతమ నామి ≫2



శుక్రవారం న్యూఢిల్లీలో ఆశాపరేఖ్‌కు ఫాల్కే అవార్డు ప్రదానం చేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# ఆశాపరేఖ్‌కు ఫాల్కే ప్రదానం

## జాతీయ చలనచిత్ర అవార్డులు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము

## అజయ్‌దేవ్‌గన్, సూర్యకు ఉత్తమ నటుడు పురస్కారం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** బాలివుడ్ సీనియర్‌నటి ఆశాపరేఖ్ సినీరంగంలో అత్యున్నతంగా భావిస్తున్న దాదాసాహెబ్ పాల్కే అవార్డును స్వీకరించారు. శుక్రవారం విజ్ఞాన్ భవన్‌లోజరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులమీదుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు. 79ఏళ్ల సీనియర్ నటి 2020 సంవతసరానికిగాను పాల్కే అవార్డుకు నామినేట్ అయ్యారు. తన 80వ పుట్టినరోజుకు ఒకరోజు ముందే ఈ గుర్తింపు తనకు రావడంతన అదృష్టంగా భావిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. కరోనా మహమ్మారికారనంగా జాతీయ ఫిలిం అవార్డులు ఏడాదిపాటు ఆలశ్యం అయ్యాయి.బాలనటిగా బాలివుడ్‌లో 1952లో ఎంట్రప్రవేశించి ఆస్మాన్‌తో తెరంగేట్రం చేసారు. తీస్రీమం జిల్, కటిపతంగ్, కారవాన్ వంటి చిత్రాలు ఆమెకు మంచి గుర్తింపును తెచ్చిపెట్టాయి. దిల్‌దేఖో, జబ్ ≫2

# పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నాగరాజు, నరసింహా రెడ్డి

## ప్రకటించిన పిడిఎఫ్ పక్షనేత లక్ష్మణరావు



ఐక్యతనుచాటుతున్న పిడిఎఫ్ నేతలు

**అనంతపురం, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త బ్యూరో:** రాయలసీమ పశ్చిమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు డాక్టర్ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డిలను పిడిఎఫ్ అభ్య ర్థులుగా పిడిఎఫ్ (ప్రొగ్రసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్) పక్ష ఉప నాయకులు కెఎస్.లక్ష్మణరావు ప్రకటించారు. అనంతపురం నగరంలోని కనకదాసు కళ్యాణ మండపంలో అభ్యర్థుల పరిచయ కార్యక్రమం జరి గింది. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అభ్యుదయ, ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ, సామాజిక తరగ తులకు చెందిన నాయకులు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కెఎస్.లక్ష్మణరావుపై ఇద్దరి పేర్లను ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి ఏర్పాటైన తరువాత ప్రజాస్వామిక గొంతుకలుండాలన్న ఉద్దేశ్యంతో పిడిఎఫ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీని 3వ తరుపున ప్రజా సమస్యలను మండలిలో వినిపించడం జరుగుతోందన్నారు. ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో ఈ ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. శాసనసభలో ఇప్పుడు వ్యక్తిగత దూషణలు తప్ప ప్రజా సమస్యలను అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యులుచర్చించే పరిస్థి తుల్లేకుండా ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. పిడి ఎఫ్ఎమ్మెల్సీలు ఒక్కటే ప్రజా సమస్యలను మండలిలో గట్టిగా వినిపించడం జరుగుతోందన్నారు. అందుకే రాయలసీమ పశ్చిమ నియోజకవర్గానికి నాగరాజు, కత్తి నరసింహ్మా రెడ్డిలను గెలిపించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్ మాట్లాడుతూ సిఐటియు తరుపున ఇద్దరు అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నామని చెప్పారు. వారి విజయానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని పేర్కొన్నారు. అధికార, ధన, బలంతో గెలిచేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థులకున్నది ప్రజా బలమన్నారు. కావున వీరి విజయానికి సమిష్టిగా పనిచేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. పిడిఎఫ్ మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకుంటూ డాక్టర్ పోతుల నాగరాజు ప్రజాసమస్యల పరిష్కారానికి అహర్నిశలు పని చేస్తున్న సీనియర్ పిడిఎఫ్ నాయకుల మార్గదర్శకాలకు అనుగుణంగా తాను నడుచుకోవడం జరుగుతుందని పోతుల నాగరాజు పేర్కొన్నారు.

# సప్తగిరులు కిటకిట

## ● బ్రహ్మోత్సవాలలో అత్యధికంగా పెరిగిన రద్దీ ● గరుడసేవకు ముందే నిండిన కొండ



**పద్మనాభమ్/తిరుమల**

సాధారణంగా తమిళభక్తులకు అత్యంత పవిత్ర మైన పెరటాసి మాసం, ఏడుకొండల శ్రీవేం కటే శ్వరుని ఈ మాసంలో భక్తితో మొక్కితే కోర్కెలు తీర్చుతాడనే విశ్వాసంతో దక్షిణ భారతదేశంలోని భక్తులు ఏడుకొండలకు చేరుకుని ఇష్టదైవాన్ని దర్శనం చేసుకుంటారు. ఈ మాసంలో ఐదు శని వారాలకు అత్యంత విశేషముంది. అక్టోబర్ 1(నేడు) పెరటాసి మాసం శనివారం రెండవ వారం కావడం, శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవా ల్లో ఐదవరోజు గరుడసేవ శనివారమే జరు గు తుండటంతో భక్తులు తండోపతండాలుగా తిరు మలకు చేరుకుంటున్నారు. మూడురోజులు సాధా రణంగా ఉన్న గ్యాలరీలు, తిరుమలకొండ శుక్ర వారం ఉదయానికి భక్తులతో నిండిపోయింది. ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో సుమారు 1.50లక్షలమంది భక్తులు చేరారు. ఈ భక్తజనం శనివారంరాత్రి గరుడసేవ వరకు ఇలాగే కొనసా గుతుంది. ఇంకా భక్తులు పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వేంకటేశ్వరునికి జరిగే బ్రహ్మోత్సవాల్లో అత్యంత కమనీయమైన, ప్రాధాన్యత ఉన్న గరుడవాహనసేవ రాత్రి 7గంటలకు మొదలవుతుంది. గరుడవాహనసేవ విశిష్టతను దృష్టిలోవుంచుకుని 3లక్షల మంది భక్తులకు వాహనసేవ వీక్షించేలా టిటిడి ఏర్పాట్లుచేపట్టింది. ఆలయమాఢవీధుల్లోని గ్యాలరీల్లో 2.50 లక్షలమందిభక్తులు స్వామి వారిని దర్శిం




వార్త

ఆరోగ్యం కలవాడే యవ్వనవంతుడు,
రుణంలేనివాడు ధనవంతుడు.
-టెన్నిసన్

# విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దు!

పిల్లలకు నాణ్యమైన చదువులు చెప్పించేందుకు తలతాకట్టుపెట్టి లక్షలాది రూపాయలు తెచ్చి వెచ్చిస్తున్నారు. విద్యార్థులు కూడా ఇళ్లు, ఒళ్లుపట్టించుకోకుండా తపస్సుమాదిరి ఈ రెండేళ్లపాటు అహర్నిశలు కష్టపడుతున్నారు. శక్తికి మించి శ్రమ చేస్తున్నారు. ఈ చదువుల కోసమే ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న విద్యార్థులు ఎందరో ఉన్నారు. తమ కోసం తల్లితండ్రులు పడుతున్న కష్టాలు, మరొకపక్క చదువుల ఒత్తిడి తట్టుకోలేక దేశవ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు. ఆ మధ్య కేంద్రహోం శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2016 ఒక్క ఏడాదిలో 9వేల 474మంది విద్యార్థులు అర్ధాంతరంగా తనువులు చాలించారు. 2011 నుండి 2016వరకు 49వేల 229మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు.

దామెర్ల సాయిబాబ

ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి ఆరాధించి పూజించిన 'సరస్వతి' రానురాను అంగడి బొమ్మగా మారిపోతున్నది. నేడు విద్య ఒక వ్యాపారంగా రూపుదాల్చింది. విద్యనే కాదు విద్యార్థులతోసహా విద్యాసంస్థలనే ఏకంగా అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. కాలేజీలకు కాలేజీలే మూకుమ్మడిగా అమ్మకాల వ్యాపారం జరుగుతున్నది.ఈ రాష్ట్రం, ఆరాష్ట్రం అని కాదు. దేశమంతా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. అందులో తెలుగు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయని చెప్పొచ్చు. విద్యాశాఖ అసమర్థతకు, పాలకుల చేతకానితనానికి, అవినీతి, రాజకీయ జోక్యానికి నిదర్శనంగా విద్యావ్యాపారం మూడుపువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. లాభసాటిగా ఉన్న వ్యాపారాల్లో గతంలో కోట్లు గడించి లక్ష్మీపుత్రులైన వారిలో దళారులు కొందరు కాంట్రాక్టర్లు, మరికొందరు రాజకీయ నాయకులు ఇప్పుడు నేరుగా విద్యావ్యాపారంలో పాలుపంచుకుంటున్నారు. ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలేకానీ ప్రైవేట్ బడులు లేవు.ఎక్కడో పట్టణాల్లో,నగరాల్లో ప్రైవేట్ పాఠశాలలు నడిచేవి. వాటిలో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవికావు. లాభనష్టాలతో సంబంధాలు లేకుండా కేవలం సేవాదృక్పథంతో ఆ విద్యాసంస్థలు ప్రజలకు సేవలు అందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి ఆ బడులు నడిపే వారు.అందువల్ల వాటిని అరికట్టాల్సిన అవసరం లేకుండాపోయింది. అందుకే అప్పట్లో చట్టాల అవసరం తలెత్తలేదు. కానీ మారిన పరిస్థితుల్లో పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, అవినీతి, వీటన్నింటిని మించి నేతలు నీతులు ఎన్ని వల్లిస్తున్నా, విద్యావిధానంలో నానాటికీ రాజకీయ జోక్యం పెరగడంతో అందుకు రెట్టింపుస్థాయిలో ప్రభుత్వ విద్యలో నాణ్యత దిగజారిపోయింది. ఇంకా దిగజారిపోతున్నది. దీనికితోడు మమ్మీ,డాడీ చదువులపై మోజు పెరగడంతో దానిని ఆసరాగా తీసుకొని అత్యంత లాభసాటి వ్యాపారంగా మార్చివేశారు. బీదాబిక్కి జనం సైతం ప్రైవేట్ విద్యకోసం ఆరాటపడుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతి లేక మరోదారిలేని వారు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. ఇంతకాలం గ్రామాలకు ఈప్రైవేట్ వ్యాపారం సోకకపోవడంతో పట్టణాలకు పంపించి, చదివించే ఆర్థికస్తోమత లేని మధ్యతరగతివారు సైతం తప్పని పరిస్థితుల్లోనే ప్రభుత్వ విద్యపై ఆధారపడుతున్నారు. గత ఒకటి రెండు దశాబ్దాలుగా మండల కేంద్రాలకు, చివరకు మారుమూల గ్రామాలకు సైతం ఈ విద్యావ్యాపారం విస్తరించింది. ఇంకా విస్తరిస్తున్నది. మరొకపక్క తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని మిగిలినవన్నీ పక్కకు పెట్టి ఆ కోణంలో అడుగులు వేస్తున్నారు. తమ పిల్లలను చదివించుకోవడం ఒక్కటే తమ జీవిత లక్ష్యంగా భావిస్తున్నారు. అందుకోసం తల్లిదండ్రులు చేస్తున్న త్యాగాలు చూస్తుంటే విస్తుపోవాల్సివస్తున్నది. పిల్లల చదువుల కోసమే పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చి వాచ్‌మెన్‌లుగానో, లేక రోజువారీ కూలీగానో ఏదో చిన్న జీవనోపాధి చూసుకొని, ఆ వచ్చే కొద్దిపాటి జీతంలోనే జాగ్రత్తగా పొదుపు చేసుకొని ఫీజులు కడుతున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా చదువు అంటే ఇంజినీరింగ్, మెడిసిన్ అనే ధ్యేయంగా ఏడెనిమిది తరగతుల నుంచే అధిక శాతం విద్యార్థులు ఈ చదువుల్లో మునిగి తేలుతున్నారు. ప్రభుత్వం ఏమి చేయడం లేదని చెప్పడం లేదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాలవరకు బాగానే ఉంటాయి.ఆచరణకు వచ్చేసరికి అసలు సమస్యలు ప్రారంభమవుతున్నాయి. ప్రాథమిక విద్య పరిస్థితి అలావుంటే ఇంటర్మీడియేట్ విద్య మరింత గందరగోళంగా తయారవుతున్నది. విద్యార్థుల భవిష్యత్‌ను నిర్ణయించేది ఈ దశలోనే. ఉన్నత విద్యకు పునాది వంటిది. విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు పడే కీలకదశ ఇదే. అందుకే ఈ స్థాయిలో అటు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎంతో జాగ్రత్తలు తీసుకుంటారు. పిల్లలకు నాణ్యమైన చదువులు చెప్పించేందుకు తలతాకట్టుపెట్టి లక్షలాది రూపాయల తెచ్చి వెచ్చిస్తున్నారు. విద్యార్థులు కూడా ఇళ్లు, ఒళ్లుపట్టించుకోకుండా తపస్సుమాదిరి ఈ రెండేళ్లపాటు అహర్నిశలు కష్టపడుతున్నారు. శక్తికిమించి శ్రమ చేస్తున్నారు. ఈ

## ఒక్క మాట

చదువుల కోసమే ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్న విద్యార్థులు ఎందరో ఉన్నారు. తమ కోసం తల్లితండ్రులు పడుతున్న కష్టాలు, మరొక పక్క చదువుల ఒత్తిడి తట్టుకోలేక దేశవాప్తంగా వేలాది మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.ఆ మధ్య కేంద్రహోం శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2016 ఒక్క ఏడాదిలో 9వేల 474మంది విద్యార్థులు అర్ధాంతరంగా తనువులు చాలించారు.2011 నుండి 2016వరకు 49వేల 229 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. దేశంలో ప్రతి గంటకు సగటున ఒకవిద్యార్థి బలవన్మరణానికి పాల్పడుతున్నాడని జాతీయ నేర గణాంకాల విభాగం ఇటీవల పార్లమెంట్‌కు నివేదించింది. పరీక్షలఒత్తిడి ప్రధాన కారణంతోపాటు కుటుంబ సమస్యలు, అనారోగ్యం,ఆర్థిక ఇబ్బందులు ప్రేమవ్యవహారాలు లాంటివి కూడా తోడౌతున్నాయి. విద్యార్థుల ఆత్మహత్యలు దేశ ప్రధాని నరేంద్ర మోదీని సైతం కదిలించాయి. పరీక్షల ఒత్తిడిని ఎలా తట్టుకొని బయటపడాలి అనే విషయాన్ని తెలియజేస్తూ ఎగ్జామ్ వారియర్స్' అనే పుస్తకాన్ని రాశారు. పది, పన్నెండు తరగతుల విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని ఎలా జయించా లనే విషయాన్ని ఆ పుస్తకంలో వివరించారు. ప్రధానే కాదు ఎందరో మేధావులు విద్యార్థులను ఈ ఒత్తిడి నుండి బయట పడేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.అయినా ఏమాత్రం తగ్గడంలేదు. పోటీ పెరిగేకొద్దీరెట్టింపుస్థాయిలో ఒత్తిడిపెరిగి ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. మరొక పక్క ప్రభుత్వ కళాశాలలో వేలాది అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. తాత్కాలిక అధ్యాపకులతో నడుస్తున్న కాలేజీలు మరి కొన్ని. ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలతో ఏర్పడిన అవినాభావ సంబంధమోమరేమోకానీ వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వ కళాశాలలను ఒకవ్యూహంప్రకారం దెబ్బతీస్తున్నారనే భావనకలిగేలా పరిస్థితి దర్శనం ఇస్తున్నది. ఇంటర్ విద్యాబోధనను, పరీక్షా నిర్వహణ,పర్యవేక్షించాల్సిన ఇంటర్‌బోర్డు నిర్వాకంతో విద్యార్థులు, తల్లిదండ్రులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ప్రభుత్వ రంగంలో ప్రమాణాలు ఏస్థాయిలో పడిపోతున్నాయో అంతకు రెట్టింపుస్థాయిలో ప్రైవేట్‌రంగం నాణ్యత పెంచినట్లు నమ్మించి కోట్లాదిరూపాయలు సొమ్ము చేసుకుంటున్నాయి.ఇంటర్మీ డియేట్ రెండేళ్లకు పదినుంచి పదిహేను లక్షల రూపాయలకుపైగా వసూలు చేసే యాజమాన్యాలు పుట్టుకొచ్చాయి. ఒక్క ఇంటర్‌స్థాయిలోనే రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు ఇరవై వేలకోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నట్లు అనధికార అంచనా. ప్రభుత్వ నిబంధనలను కొన్నిప్రైవేట్ యాజమాన్యాలు పాటించవు.కొన్ని కార్పొరేట్ యాజమాన్యాలు అయితే ప్రభుత్వాన్నే శాసించే స్థాయికి ఎదిగిపోయాయి.ఏ అధికారి ఎక్కడఉండాలో కొన్నికార్పొరేట్ విద్యాసంస్థలు నిర్దేశిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాలు ఏ సందర్భంలోనూ తమను ఏమీ చేయలేవనే ధీమాకొందరు ప్రైవేట్ యాజమానులకు పెరిగిపోయింది. నిర్దిష్ట మైన ఫీజులు వసూలు చేయాలని, చట్టవిరుద్ధంగా ఏ రూపంలో ఫీజులుపెంచి వసూలు చేస్తే చర్యలు తప్పవని పాలకుల హెచ్చరికలను పట్టించుకునే పరిస్థితుల్లో కొన్ని యాజమాన్యాలు లేవు. కళాశాలలో ఉండాల్సిన క్రీడామైదానాలు,సైన్స్‌ల్యాబ్‌లు, లైబ్రరీలు, మరుగుదొడ్లు సరిపడ వెలుతురు, గాలి ఉండేలా నిబంధనలను రూపొందించారు. వీటిని పాటించేవారికి అనుమతులు ఇవ్వాలన్నారు. కానీ ఎన్నోజూనియర్ కాలేజీలు గాలి, వెలుతురు లేని గదుల్లో నిబంధనలకు వ్యతిరేకంగా లెక్కకుమించి కుక్కుతున్నారు. ఆటస్థలాల సంగతి దేవుడెరుగు. కాలుమోపడానికి ఖాళీస్థలంకూడా లేని కళాశాలలు ఎన్నో ఉన్నాయి.ఇక మరుగు దొడ్లు, మంచినీరు సౌకర్యాలు అంతంత మాత్రమే.రానురాను విద్యావ్యవస్థ ఎంతటి పతనావస్థకు దిగజారిపోతున్నదో జరిగిన, జరుగుతున్న సంఘటనలు అద్దంపడుతున్నాయి. చదువులతల్లి సరస్వతిని నడిబజారులో విక్రయించే ఘోర స్థితికి చేరుకోవడం,చదువే జీవన్మరణ సమ స్యగా రాత్రింబవళ్లు కృషిచేస్తున్న విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచిస్తే హృదయం ద్రవించకతప్పదు. ఏదిఏమైనా తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు నెరవేరుస్తూ ఉజ్వల భవితకు బాటలు వేసుకుంటూ భవిష్యత్తులో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన ఈ చిరుదివ్వెలు అర్ధాంతరంగా ఆగిపోవడం అత్యంత దురదృష్టకరం, బాధాకరం. ●

# కాగితాల్లోనే గిరిజన సంక్షేమం!

గిరిజన సంక్షేమం, అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నామని దేశ వ్యాప్తంగా వేలాది కోట్లు వెచ్చిస్తున్నామని, ఒకపక్క నేతలు గొప్పలు చెప్పుకుంటున్నా మరొక పక్క కనీస వైద్యం, విద్య లాంటి సదుపాయాలు లేక అర్థాకలితో అల్లాడుతున్న కోట్లాది మంది గిరిపుత్రుల బాధలు వర్ణనాతీతం. వైద్యసదుపాయం మాట అటుంచి కడుపునిండా తిండిలేక, పౌష్టికాహారం లోపించి లక్షలాది మంది గిరిపుత్రులు అనేక వ్యాధుల బారినపడుతున్నారనే వార్తలు ఆవేదన కలిగిస్తున్నాయి.అన్నింటికంటే ముఖ్యంగా భావిభారత పౌరులుగా ఎదగాల్సిన అనేక మంది గిరి బాలలు రేచీకటి, గ్లోకోమా, క్యాటరాక్ట్, విటమిన్ -ఏ లోపంతో క్రమేణా కనుచూపు కోల్పోతున్నారనే వార్తలతో ఆందోళన చెందని ప్రజాస్వామ్యవాదులు ఉండరు. సర్వేంద్రియాల్లో కళ్లు అత్యంత ప్రధానమైనవి. అవే క్రమేణా మూసుకుపోయి అంధులుగా మారితే ఆ వ్యక్తితోపాటు ఆ కుటుంబం పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందోఊహించుకోవచ్చు. అవిద్య, అజ్ఞానం, మూఢత్వం, దారిద్ర్యం ప్రకృతితోపాటు తోటిమానవుడు దోపిడీలతో గిరిజన ప్రాంతాలు అతలాకుతలం అవుతున్నాయి. గిరిపుత్రులకు ప్రత్యేక ప్యాకేజీలంటూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న కోట్లాది నిధుల్లో నాలుగోవంతు కూడా వారి దరికి చేరడంలేదు. ఈ విషయం ఎన్నోసార్లు పాలకులు కూడా అంగీకరించక తప్పలేదు. స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటి అమృతోత్సవాలు జరుపుకుంటున్నావారి బతుకుల్లో మాత్రం ఏమాత్రం మార్పురాలేదనే చెప్పొచ్చు. భారత రాష్ట్రపతిగా గిరిజన తెగకు చెందిన ద్రౌపతిముర్ము ఇటీవల బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశవ్యాప్తంగా ఆదివాసుల సమస్యలపై మళ్లీ విస్తృత చర్చ జరుగుతున్నది. ఆరోగ్యం, పౌష్టికాహారం, కనీస వసతులు వంటివి వారికి ఇంకా దూరంగానే ఉన్నాయి. పదకొండేళ్ల క్రితం జనాభా లెక్కల ప్రకారం భారత్‌లో దాదాపు పదకొండు కోట్ల మంది గిరిజనులు ఉన్నట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి. అయితే ఆదివాసుల ఆరోగ్య పరిరక్షణకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన మేరకు ఫలితాలు అందడం లేదు. ఆదివాసుల ఆరోగ్యపరిస్థితిని సమగ్ర అధ్యయనం చేసేందుకు దశాబ్దం క్రితం గ్రామీణ ఆరోగ్యరంగ నిపుణులు డాక్టర్ అబయ్‌బంగ్ నేతృత్వంలో కమిటీని నియమించారు. ఆ కమిటీ అనేక ఆదివాసుల ప్రాంతాలను పర్యటించి సమగ్రంగా అధ్యయనంచేసి 2018లో నివేదిక సమర్పించింది.ఆయా ప్రాంతాల్లో మలేరియా కేసులుఅత్యధికంగా నమోదు అవుతున్నాయని, ప్రతి నలుగురిలో ఒకరు అధికరక్తపోటుతో బాధపడుతున్నారని వెల్లడించింది. దేశవ్యాప్తంగా పౌష్టికాహార లోపంపై జరుగుతున్న పోరాటంలో ఆదివాసుల ప్రాంతాలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా వైద్యం విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంచేశారనే చెప్పొచ్చు. ఎండాకాలం పోయి వర్షాకాలం ఆరంభమయ్యే సమయంలో పాతనీరు, కొత్తనీరు కలయికతోపాటు వాతావరణంలో వచ్చేమార్పుల వల్ల ఈ మలేరియా, డయేరియా, స్వైన్ ఫ్లూ, డెంగ్యూ లాంటి వ్యాధులు విజృంభించడం ప్రతియేటా సర్వసాధారణ మైపోయింది. గిరిజనుల అనారోగ్యాన్ని, వారుపడుతున్న ఇక్కట్లను రాజకీయ అవసరాల కోసమే వాడుకునే ప్రయత్నం చేస్తున్నారేతప్ప త్రికరణశుద్ధిగా వారి సమస్యల పరిష్కారానికి అడుగులు పడడంలేదనే చెప్పొచ్చు. ప్రతిపక్షంలో ఉన్న నాయకులుకొందరు గిరిజన ప్రాంతాలకు వెళ్లివారిని కలుసుకొని పరామర్శించడం, ప్రభుత్వంపై ధ్వజమెత్తడం,అలాగే అధికారంలో ఉన్న వారు అంతగా పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిపోయింది. కొన్ని రాష్ట్రాల్లో వారికికేటాయించిన నిధులు ఇప్పటికీ పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇతర విషయాలు ఎలాఉన్నా గిరిజనుల విషయంలో వైద్యసేవలను నిర్లక్ష్యం చేయడం క్షమార్హం కాదు. వైద్యం, విద్య విషయంలో ప్రత్యేక శ్రద్ధవహించి వారికి కేటాయించిన నిధులువారికి అందేలా చూడటంలో పాలకులు విఫలమవుతున్నారు. వాస్తవంగా చూస్తే 1970 లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాంఘిక సంక్షేమశాఖనుంచి విడదీసి గిరిజన సంక్షేమశాఖను ఏర్పాటు చేశారు.ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొట్నాక్ భీమ్‌రావును తొలి గిరిజన సంక్షేమశాఖ మంత్రిగా నియమించారు. ఆయన మంత్రిగా పదవీబాధ్యతలు చేపట్టగానే ఎంతోకాలంగా మూలనపడి ఉన్న హైమండర్ఫ్ నివేదికలోని సిఫార్సులను అమలు చేసేందుకు శ్రీకారంచుట్టారు. ఆనాడే గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటిడిఏ ఏర్పాటుకు నాంది పలికింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది ఐటిడిఏల ద్వారా వందలాది కోట్లు అప్పటినుంచి ఖర్చుపెడుతూనే ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించారు. కొంతవరకు భవనాలను నిర్మించారు. డాక్టర్లను, కిందిస్థాయి ఉద్యోగులను నియమించే ప్రయత్నాలుచేశారు. కానీవారిని గిరిజన ప్రాంతాలకు పంపడంలో విఫలమవుతున్నారు.గిరిజనులకు వైద్య సిబ్బందిని అందు బాటులో ఉంచలేకపోతున్నారు. దీనికితోడు సరఫరా అవుతున్న మందులు నాసిరకంగా ఉండడంతో రోగాలు తగ్గక, నమ్మకం సన్నగిల్లి గిరిజనులు తమ పాత నాటువైద్యం వైపే మొగ్గుచూపుతున్నారు.పసర్లతో, వచ్చీరాని వైద్యం చేసుకొని ఆరోగ్యం చెడ గొట్టుకుంటున్నారు. ఇప్పటికీ దేశవ్యాప్తంగా గిరిజనాభి వృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది కోట్లప్రజాధనాన్ని వెచ్చిస్తూనే ఉన్నారు. నిజానికి అందులో నాలుగోవంతు వారికిచేరినా ఈ పరిస్థితి దాపురించే అవకాశమేలేదు. రాజకీయాలకు అతీతంగా వారిఅభ్యున్నతికి పాటుపడాలి. ముఖ్యంగావైద్యం, విద్యవంటికనీస సదుపాయాలను అందించాల్సిన బాధ్యత నేతలపై ఉంది. దీనిని విస్మరిస్తే చరిత్ర క్షమించదు.

# సిపిఎస్ పథకం ఎంతవరకు ప్రయోజనకరం!

సి.హెచ్.ప్రతాప్

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సిపిఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్‌స్కీం) విశ్రాంత ఉద్యోగులకు పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం చందాన అవుతోంది. విశ్రాంత ఉద్యోగులకు ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా, ఆర్థికంగా తమ ఇతర కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా అమలు చేసే పెన్షన్ విధానంలో వారికి మరింత ప్రయోజనం చేకూర్చేవిధంగా సంస్కరణలు చేపట్టం అనేది మంచి చర్య. కానీ అందుకు భిన్నంగా ప్రశాంత జీవనాన్ని మరింత కల్లోలభరితం చేసే మార్పులు చేయడం అనేది అహేతుకం. 2004లో గత ఎన్‌డిఏ ప్రభుత్వం రెగ్యులర్ పెన్షన విధానం స్థానంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానం ప్రవేశపెట్టినప్పుడు దేశంలో లక్షలాది విశ్రాంత, రెగ్యులర్ ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతింటాయని ఉద్యోగ సంస్థలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వాలకు చీమైనా కుట్టినట్లు లేదు.ఉద్యోగుల పెన్షన్ డబ్బును షేర్లలో మదుపు పెట్టే ప్రక్రియను నిర్వహించేందుకు ప్రభుత్వం 2005లో ఒక రెగ్యులేటింగ్ ఆథారిటీని నియమించింది. కార్పొరేట్ సంస్థల షేర్ల విలువలను ప్రభావితం చేసే విధంగా ఈ ఆథారిటీ ఉద్యోగుల పెన్షన్ నిధులను ఈ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టి తద్వారా వచ్చే లాభనష్టాలను లెక్కలు వేసి ఆ లాభనష్టాలను ఉద్యోగులపెన్షన్ అకౌంట్‌లోకి బదలీ చేస్తుంది. అందువలన ఉద్యోగుల పెన్షన్ ఖాతాలలోడబ్బు హెచ్చుతగ్గులకు గురవుతూ ఉంటుంది. ప్రశాంతంగా బతకాల్సిన జీవితాలలో ఇదేం టెన్షన్ అని లక్షలాది ఉద్యోగులు వాపోతున్నారు. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాల తరహాలో ఉద్యోగుల పెన్షన్ సొమ్ము నుండి 8 శాతం స్టాక్ మార్కెట్‌లోకి మళ్లించి అక్కడ వచ్చే లాభనష్టాలను బట్టి ఉద్యోగుల పెన్షన్ నిధిలో మార్పులు చేయడం అనే విధానం విశ్రాంత ఉద్యోగులకు అప్రయోజనకారిగా ఉంది. జీవితాంతం రెక్కలు ముక్కలు చేసుకుని ఉద్యోగ విరమణ చేసిన అనంతరం వారి శ్రమకు ఫలితంగా శేషజీవితం గౌరవప్రదంగా బతికేందుకు నిర్దేశించిన పెన్షన్ సొమ్మును ఉద్యోగుల అభిప్రాయాలు, అనుమతులతో పనిలేకుండా స్టాక్‌మార్కెట్‌లో పెట్టే హక్కు కేంద్ర ప్రభుత్వానికి ఎంత మాత్రం లేదు. ఇది చాలక స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకుల కారణంగా ప్రభుత్వం పెట్టుబడులకు నష్టంవస్తే ఆ బాధ్యత ఈ విధానంతో ఏ మాత్రం సంబంధంలేని ఉద్యోగులే వహించాల్సిరావడం, సదరు స్కీములో ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రైవేట్‌రంగం ఉద్యోగులను కూడా ఇరికించడం అనే ప్రభుత్వ విధానం పెట్టుబడిదారీ వ్యవస్థకు మద్దతు ఇచ్చేదిగా ఉంది. అన్నిరంగాలలో సంస్కరణలు తెచ్చే అధికారం ప్రభుత్వానికి ఉంది. అయితే ఉద్యోగుల సొమ్మును స్టాక్‌మార్కెట్‌లో మదుపు చేయడం ఎంతమాత్రం సమంజసంకాదు.ఉద్యోగులు తమ ఆర్జితంపై స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టుకుంటే అది వారి వ్యక్తిగత విషయం. కానీ ప్రభుత్వం ఇందులో తలదూర్చి వారి సొమ్ముతో ఆటలాడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ●

ఏడాదికి ఓ చెడు అలవాటు మానితే, కొంతకాలానికి దుష్టుడు కూడా మంచివాడుగా మారగలడు.



ఫ్రాంక్లిన్

విషం ఒకసారి మాత్రమే పనిచేస్తుంది. చెడు గ్రంథం నిరంతరాయంగా ప్రజల మనసుల్ని కలుషితం చేస్తూంటుంది.



జాన్‌ముర్రే

## ప్రజావాక్కు



### అపరిశుభ్రతకు నిలయం బెంగళూరు

భారతదేశంలోనే ప్రసిద్ధి పొందినటువంటి బెంగళూరు రైల్వే స్టేషన్, పట్టణం కూడా అపరిశుభ్రతకు మారుపేరుగా నిలుస్తుంది. భారతదేశంలోనే సాఫ్ట్‌వేర్ కంపెనీలకు నిలయంగా, సిలికాన్ సిటీగాపేరుగాంచిన బెంగళూరు పట్టణం చెత్తాచెదారంతో దుమ్ముధూళితో నిండి ఉండి వివిధ ప్రదేశాల నుండి బెంగళూరుకి వచ్చేవారు అసౌకర్యానికి గురి అవుతూ ఉన్నారు. యేటా పర్యాటకుల ద్వారా కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్న పాలకులు పరిశుభ్రత మీద దృష్టిపెట్టడం లేదు. అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. ముఖ్యంగా బెంగళూరు రైల్వే స్టేషన్ సమీపంలో చెత్తాచెదారం అస్తవ్యస్తంగా ఉంది.దసరా సెలవులు రావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి అనేక మంది ఉపాధ్యాయ, ఉద్యోగ కుటుంబాలు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా బెంగళూరు వైపు వస్తూంటారు. క్లీన్ సిటీగా పేరుగాంచిన బెంగళూరు రాష్ట్రం అపరిశుభ్రతకు నిలయంగా మారడంతో పర్యాటకులు చీదరించుకుంటున్నారు.

-కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లిజిల్లా

### కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

రాష్ట్రంలోని కోస్తా ప్రాంతం ప్రజల సౌలభ్యం కొరకు విజయవాడ, విశాఖపట్నంలో లోకాయుక్త జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర లోకాయుక్త రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరి సంవత్సరాల కాలం గడిచిపోయింది. అయినా ప్రభుత్వంవైపు నుంచి ఎటువంటి స్పందన లేదు. మూడు రాజధానులు, పాలన వికేంద్రీకరణతోనే అభివృద్ధిసాధ్యం అంటున్న పాలకులు లోకాయుక్త జోనల్ కార్యాలయాలను వెంటనే విజయవాడ,విశాఖలో ఏర్పాటు చేయాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కూడా బేషుగ్గా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. ఇంకా ఆలస్యంచేస్తే ముఖ్యమంత్రి విశ్వసనీయత మరింత తగ్గుతుంది.

-కంభంపాటి కోటేశ్వరరావు, విశాఖపట్నం

### మేడిపండు ప్రగల్భాలు!

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే ఎపి ఫస్ట్ అని ముఖ్యమంత్రి అంటున్నారు. అయితే సెప్టెంబరు మాసం ముగుస్తున్నా, దాదాపు15వేల చిన్న,మధ్యతరహా పరిశ్రమలకు ఇవ్వవలసిన 785 కోట్ల రూపాయల ప్రోత్సాహం ఈరోజు వరకు విడుదల చేయలేదు. ప్రోత్సాహకం కోసం పరిశ్రమల వారు ఎదురుచూస్తున్నట్లు పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. మరి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కి అర్థమేమిటో.అయిన దానికికానిదానికి నిత్యం మీడియా ముందుకు వస్తున్న సలహాదారులైనా వివరణ ఇస్తే బాగుంటుంది.

-జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### ఎలక్ట్రికల్ బస్సులతో ఎంతో మేలు

ప్రజారవాణా రంగంలో ఎపిఎస్‌ఆర్టీసీ నూతన శకానికి నాంది పలికింది. అలిపిరి బస్సుడిపో కేంద్రంగా తిరుమల, తిరుపతి మధ్య తొలిసారిగా ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశపెట్టడం జరిగింది.ఈ బస్సులు వినియోగంలోపర్యావరణానికి ఎంతో మేలు జరగనుంది. పర్యావరణాన్ని దెబ్బతీసే హానికరమైన కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి.శబ్ద,వాయుకాలుష్యం తగ్గుతుంది. ఆర్టీసీకి డీజిల్ భారంతగ్గనుంది. ఈబస్సు నడపడానికి కిలోమీటర్‌కు కేవలం రూ.8 ఖర్చు మాత్రమే కావడం ఆర్టీసీకి కూడా ఎంతో లాభదాయకం.ప్రయాణికులకు కూడాశబ్దంలేని ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన ప్రయాణం చేసే అవకాశం లభించింది. ఎలక్ట్రిక్ వాహనాలకు ఆశాజనకమైన భవిష్యత్తు ఉంది. రానున్న రోజుల్లో ఆర్టీసీ మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులు నడపడానికి ముందుకు రావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-చల్లాచంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

### దురాశ దుఃఖానికి చేటు

సభలు, సమావేశాల ద్వారానే కాక సోషల్ మీడియా ద్వారా కూడా విపరీతమైన ప్రచారం చేసుకుంటున్నారు ప్రతినిత్యం వార్తల్లో ఉంటూ ప్రజల దృష్టితమపై పడేలా చేసుకుంటున్నారు రాష్ట్ర నాయకులతోపాటు కేంద్ర మంత్రులు తమ నోటికి పని చెబుతున్నారు. వీరిరువురు కలిసి కె.సి.ఆర్‌పై నిప్పులు చెరుగుతున్నారు. టి.ఆర్‌ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్. వైఎస్‌టిపి, బిఎస్పీ ఇంకా మరికొన్ని పార్టీల వారు ఇదే పనిలో బిజీగా ఉంటున్నారు. కె.సి.ఆర్‌ను గద్దెదించాలనే ఏకైకలక్ష్యంతో ప్రయత్నాలు చేస్తున్నారు. ఎత్తుగడలు వేస్తున్నారు. కెసిఆర్‌పై మూకుమ్మడి దాడి చేస్తున్నారు. పదవులు, అధికారం కోసం దిగజారిపోతున్నారు. రానున్న ఎన్నికలలో ఈ పార్టీల వారికి ప్రజలు తగిన రీతిలో జవాబు చెప్పకమానరు.

-మిథునం, హైదరాబాద్

### ధూమపానానికి దూరంగా ఉండాలి

భూమిలో పండే పొగాకు భూమిని కలుషితం చేయడంతోపాటు ప్రజలఆరోగ్యాన్ని కూడాదెబ్బతీస్తుంది. మనదేశంలో ఊపిరితిత్తుల కేన్సర్‌కి ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగమేనని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. 90శాతం ఊపిరితిత్తుల కేన్సర్‌కు కారణం సిగరెట్ తాగడమే. ఇటీవల ఎక్కడ చూసినా పొగతాగరాదు అనే నోటీసు బోర్డు కన్పిస్తుంది. ఇవి కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యాయి. అమలు మాత్రం ఎక్కడా జరగడం లేదు.

-యం.రాంప్రదీప్, తిరువూరు

# వృద్ధులు సుదీర్ఘ అనుభవాలకు ఆనవాళ్లు



సుంకవల్లి సత్తిరాజు

బుడిబుడి నడకల ప్రాయం దాటి, వడివడి అడుగులు వేసి అక్షరాల బాటపట్టిన బాల్యంలో అమాయకత్వం ఉట్టిపడుతుంది. ఆటపాటలతో అలరించే బాల్యం కొన్నేళ్లు కొనసాగి, అదృశ్యమై యవ్వన దశ ప్రాప్తిస్తుంది. యవ్వనం మానసిక భావోద్వేగాలతో కూడుకున్న అత్యంత విలువైన దశ. ఉన్నత విద్యలు, ఉపాధి కోసం పోరాటాలు, ప్రేమలు, పెళ్లిళ్లు, ఆతర్వాత పిల్లలతో యవ్వన దశ ముగుస్తుంది. పిల్లలను పెంచి విద్యాబుద్ధులు నేర్పి, వారికి పెళ్లిళ్లు చేసి, కుటుంబ బాధ్యలతో జుట్టు నెరసి మధ్య వయస్కులుగా మారి అనేక కష్టనష్టాల కోర్చి, అన్ని బాధ్యతలు నెరవేర్చి, విశ్రాంతి తీసుకునే తరుణం ఆసన్నమవుతుంది. అదే 'వృద్ధాప్యం'. అదే జీవిత చరమాంకం. సాఫీగా, ప్రశాంతంగా సాగవలసిన వృద్ధాప్యం కూడా నేడు అనేక అలజడులకు, ఆటుపోట్లకు గురవుతున్న నేపథ్యాన్ని విశ్లేషించాలి. కుటుంబంలో విలువలు క్షీణించడం, సంబంధాలు విచ్ఛిన్నం కావడం, మానవత్వం లోపించడం వంటి ఆధునిక నాగరికతా విశృంఖల ప్రవాహంలో వృద్ధులను గౌరవించే వ్యవస్థ ఛిద్రమైపోతున్నది. ప్రేమానురాగాలు పెంపకాలతో, పంపకాలతో అంతరించిపోతున్నాయి.బంధాలమధ్య అనేక అవరోధాలు ఏర్పడుతున్నాయి. అనారోగ్యంతో ఒకవైపు, ఆర్థిక సమస్యలతో మరోవైపు, ఎవరూ పట్టించుకునే వారు లేక దిక్కూమొక్కూ లేని పరిస్థితుల మధ్య వృద్ధాప్యం ఒకశాపంగా పరిణమిస్తున్నది. అన్నీ తామై ఆలనా పాలనా చూసి, విద్యాబుద్ధులు నేర్పి, ప్రయోజకులను చేసి, తమ కాలిలో ముల్లు దిగితే, తమకంట్లో దూలం దిగబడినట్లు కన్నీరు కార్చిన కళ్లల్లో కఠిన,కర్కశ హృదయాల నిర్దాక్షిణ్యం వలన వృద్ధాప్యంలో రక్తధారలు ప్రవహిస్తున్నాయి. ఎంతో మంది అవసానదశలో అగచాట్లు పడుతున్నారు. స్వేదం చిందించిన శరీరం ఛిద్రమైపోతున్నది. భద్రత కల్పించిన చేతులు భగవంతుడిని వేడుకుంటున్నాయి. ఆపన్నహస్తాల కోసం ఎదురుచూస్తున్నాయి.ఎవరో వస్తారని, ఏదోఉద్ధరిస్తారని ఎదురు చూసిన కళ్లు కాయలు కాస్తున్నాయి. అవసాన దశలో ఆప్యాయతలు కరవై, అంతిమ ఘడియల కోసం ఎదురుచూస్తున్న వారెందరో చివరికి అనాథలుగా బతుకు చాలిస్తున్నారు.దహన సంస్కారాలు చేసేవారు లేక కుళ్లిన శవాలై ఎక్కడో తేలియాడుతున్నాయి. గతకాలంలో చేసిన త్యాగాలు ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. కేవలం జ్ఞాపకంగా మిగిలి బాధిస్తున్నాయి. బరువెక్కిన హృదయాల్నీ మౌనంగా రోదిస్తున్నాయి. బతుకంతా త్యాగాలు చేసి, అవసాన దశలో అగచాట్లు పడుతున్న వారెందరో మానసిక క్షోభతో మరణిస్తున్నారు. ఏమిటీ దురవస్థ?ఎందుకీ వివక్ష? చిందించిన చెమటకు,శ్రమించిన కాయానికి, ప్రేమను పంచిన హృదయాలకు ఎందుకీ శిక్ష? వృద్ధాప్యం ఎందుకిలా విషమ సమస్యగా మారింది. ఏమిటీ కర్మ? ఎవరు చేసిన పాపానికి ఎందుకీ శిక్ష?ఎందుకు వార్ధక్యం విలపిస్తున్నది? ఎందుకు వృద్ధాప్యం అనాథ శరణాలయాల చుట్టూ పరిభ్రమిస్తున్నది? నిజాయితీ, నిలకడ, విలువలు, వివేకం లోపించిన సమాజంలో జరుగుతున్న ఈ దుర్మార్గపు సంస్కృతికి అంతం లేదా?



అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

వయసుడిగిన దశలో అనాథలుగా, రోడ్లపైకి విసిరి వేయబడుతున్న వారెందరో నిత్యం మనకు తారసపడుతున్నారు. వెలుగు నింపిన జీవితాలు ఎందుకిలా చీకటి పాలవుతున్నాయి? భిక్షాటన చేస్తూ, జీవించవలసిన పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? వార్ధక్య దశలో అనాథలుగా బతుకీడ్చడంలో కుటుంబాల పాత్ర ఎంత? సమాజం పాత్ర ఎంత? ఇంటా బయటా అన్యాయంగా బలైనవారు స్థాయి అనే పేరుతో ఈ సమాజం చేత తిరస్కరింపబడి, దూరంగా ఆవలికి గెంటి వేయబడుతున్న వారి విలాపం ఎవరికి శాపంలా మారుతున్నది? దీనికి శిక్షఏమిటి?ఎన్నో కారణాలు జీవిత అవసాన దశను అస్తవ్యస్తంచేస్తున్నాయి. ఉన్నత చదువుల పేరుతోనో, ఉద్యోగాల పేరుతోనో, వేరు కాపురాల పేరుతోనో కని పెంచిన పిల్లలు అవసానదశలో తల్లిదండ్రులను దూరం పెట్టడం, వృద్ధాశ్రమాల్లో చేర్పించడం జరుగుతున్నది. మరికొంత మంది తమ స్థాయికి తగరన్నట్టుగా వృద్ధాప్యమని చూడకుండా నిర్దాక్షిణ్యంగా వదిలేయడం అమానుషత్వానికి పరాకాష్ఠ. వృద్ధాప్యం అంటే శాపం కారాదు. వృద్ధాప్యమంటే సుదీర్ఘ జీవితకాల అనుభవాల సారాంశం. తాతలు, తండ్రులు, కొడుకులు, కూతుళ్లు మనవలు,మనవరాళ్లు, ఇలా తమ జీవితాన్నే కాకుండా కడదాకా బతికుంటే నాలుగైదు తరాల జీవిత అనుభవాలను స్పృశించగలరు. తరాల మధ్య అంతరాలను, ఆ తరాల అంతరంగాన్ని మదించి,జీవిత సారాంశాన్ని ఒడిసిపట్టి రాబోవు తరాలకు తమ అనుభవాలను అందించే నిజమైనకుటుంబ వారసత్వ సంపదకు నిదర్శనం 'వృద్ధతరం'. అలాంటి వృద్ధతరం పలు కారణాలవలన అనేక అవమానాలకు గురి కావలసివస్తున్నది. ధనిక,పేద, అనే తారతమ్యం లేదు. కులం, మతం అనే బేధంలేదు. అందరిదీ ఒకటే ఆవేదన. అదే వృద్ధాప్యం కలిగించిన వైపరీత్యం.కోట్లు గడించినా అవసాన దశలో ఆదరించేవారు కరవై, అనారోగ్యంతో అవయవాలు చెడి, మంచంపై నరకయాతన పడుతూ, కనికరించమని చావును బతిమాలాడుతూ, కన్నీరు మున్నీరై విలపిస్తూ,అందరూ ఉన్నా అనాథల్లా జీవశ్చవాల్లా బతుకీడుస్తున్న వృద్ధుల కష్టాలు వర్ణింపనలవికాదు. వయోభారం వలన సంభవిస్తున్న అనారోగ్య కారణాలతో చికిత్సకు నోచుకోక మరణిస్తున్న వారు కొందరైతే, కనిపెంచిన వారిమమకారానికి నోచుకోక, ఈసడింపులకు, నిర్లక్ష్యానికి, అమానుషత్వానికి ఆవేదనతో ఆగిపోతున్న గుండెలెన్నో! వృద్ధుల మనోగతం అవగతం చేసుకోలేకపోతున్నాం. కొన్నాళ్లకు మనదీ అదే గతి అని అవగాహన చేసుకోలేక, వ్యక్తిత్వం, సంస్కారం నశించి, మానవత్వం కోల్పోయి, మానసికంగా పతనమై వృద్ధుల ఆవేదనకు, మానసిక క్షోభకు కారణం కావడం అత్యంత హేయం. మానసికంగా కుమిలిపోతూ, నిరాశానిస్పృహలతో, శూన్యంలోకి చూస్తూ అంతిమ క్షణాలను అతి దుర్భరంగా గడుపుతూ అనాథలుగా మరణిస్తున్న వృద్ధుల జీవిత కథలను లోతుగా విశ్లేషణ చేయాలి.వృద్ధులకు ఎదురవుతున్న పరిస్థితులను ఎలా అధిగమించాలి?వృద్ధులను ఎలా సంరక్షించాలి అనే ఆలోచన చేయాలి.ఇలాంటి ఆలోచనల నుండి ఉద్భవించినదే 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం'.వృద్ధుల సంక్షేమంకోసం, వారు ఎదుర్కొంటున్న సాధకబాధకాల గురించి ఐక్యరాజ్యసమితి అనేక తీర్మానాలు ఆమోదించి ప్రపంచ దేశాలకు పంపించింది. వృద్ధులకు సంబంధించిన అంతర్జాతీయ సమావేశం 1984లో ఆస్ట్రియా రాజధాని వియన్నాలో జరిగింది.తర్వాత జరిగిన అనేక సమావేశాల అనంతరం వృద్ధులను గౌరవించాలనే సదుద్దేశ్యంతో ప్రతీయేటాఅక్టోబర్ 1వ తేదీన 'అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం' జరుపుతున్నారు. అంతర్జాతీయ సమాజం వృద్ధులసంరక్షణ కోసం విశేషకృషి చేయాలి.ప్రభుత్వాలు వృద్ధులకు అన్నివిధాలా అండగా నిలవాలి. ప్రభుత్వాలే వృద్ధాశ్రమాలను నిర్మించి, అనాథలుగా మారి విలపిస్తున్న వృద్ధులకు ప్రశాంతంగా జీవించే పరిస్థితులు కల్పించాలి. ●

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

## సిడిఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌చౌహాన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** రక్షణరంగంలో అత్యున్నత పదవి సిడిఎస్ కొత్త అధిపతిగా లెఫ్టినెంట్‌జనరల్ అనిల్‌చౌహాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తొలిసిడిఎస్‌గా బాధ్యతలుచేపట్టిన బిపిన్‌రావత్ అకాలమరణం తర్వాత తొమ్మిదినెలలుగా ఖాళీగా ఉన్న ఈ పోస్టును జనరల్‌చౌహాన్‌తో భర్తీచేసారు. స్వాతంత్ర్యం వచ్చినతర్వాత త్రీస్టార్ లెఫ్టినెంట్‌జనరల్ ర్యాంకు అధికారి ఒకరు ఫోర్‌స్టార్ జనరల్ ర్యాంకు పోస్టులో బాద్యతలు స్వీకరించడం ఇదే ప్రథమం. జాతీయ యుద్ధవీరుల స్మారకం వద్ద జనరల్ చౌహాన్ నివాళులర్పించారు. సౌత్‌బ్లాక్‌లాన్స్‌లో గౌరవ వందనం స్వీకరించిన తర్వాత బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆయన కార్యాలయంలోనే కలిసారు.



జనరల్‌చౌహాన్ తన బాద్యతలతోపాటే సాయుధదళాలపునర్‌వ్యవస్థీకరణ బాధ్యతలు పర్యవేక్షిస్తారు. 11 గోర్ఖారైఫిల్స్‌లో 1981లో మొదటిసారి సర్వీసులో చేరిన చౌహాన్ మిలిటరీ కార్యకలాపాల డైరెక్టర్ జనరల్‌గా కూడా వ్యవహరించారు. జనరల్‌చౌహాన్ తూర్పుకమాండ్ విభాగానికి కమాండింగ్ ఇన్‌ఛీఫ్ గా కూడా వ్యవహరించారు. 2021 మే 31వ తేదీ పదవీ విరమణచేసేంతవరకూ అదే పదవిలోకొనసాగారు. సర్వీస్‌చీఫ్‌తో సమానంగా సిడిఎస్ ఫోర్‌స్టార్ ర్యాంకు పోస్టు. త్రివిధ దళాధిపతులకున్న ప్రమాణాలే ఆయనకు వర్తిస్తాయి. సిడిఎస్ మిలిటరీ వ్యవహారాల విభాగం పర్యవేక్షిస్తారు. ఆ తర్వాత రక్షణరంగ కార్యదర్శిగా కూడా ఉంటారు. రక్షణ మంత్రికి ప్రిన్సిపల్ మిలిటరీ సలహాదారుగా ఉంటారు. సిఒఎస్‌సికి శాశ్వత ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.



## అంబులెన్స్ వెళ్లడం కోసం ఆగిపోయిన ప్రధాని కాన్వాయ్

**అహ్మదాబాద్, సెప్టెంబరు 30:** త్వరలో గుజరాత్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన బిజెపి సర్కార్ పూర్తిచేసి ప్రారంభోత్సవాలు నిర్వహిస్తోంది. అంబులెన్స్‌కు దారి ఇవ్వడం కోసం ప్రధాని నరేంద్ర మోడీ తన కాన్వాయ్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి గాంధీనగర్‌కు మోడీ వెళుతున్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియోను గుజరాత్ బిజెపి మీడియా విభాగం ట్విటర్‌లో షేర్ చేసింది. అహ్మదాబాద్, గాంధీనగర్ మార్గంలో ప్రధాని కాన్వాయ్‌లోని ఎస్‌యువిలు నెమ్మదిగా ఎడమవైపునకు వెళ్లి అంబులెన్స్‌కు దారి ఇస్తున్నట్లు వీడియోలో కనిపిస్తోంది. ప్రధాని మోడీ గురువారం నుంచి గుజరాత్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. శుక్రవారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లోని దూరదర్శన్ కేంద్రం వద్ద నిర్వహించిన బహిరంగసభలో ప్రధాని పాల్గొని గాంధీనగర్‌లో రాజ్‌భవన్‌కు తిరిగి వెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. అహ్మదాబాద్ నుంచి గాంధీనగర్‌కు వెళుతున్న సమయంలో అంబులెన్స్‌కు దారి ఇవ్వడానికి ప్రధాని నరేంద్రమోడీ కాన్వాయ్ నిలిచిపోయింది అని గుజరాత్ బిజెపి ఓ ప్రకటన విడుదల చేసింది. రెండో రోజు శుక్రవారం ప్రధాని గుజరాత్‌లో పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. అహ్మదాబాద్ మెట్రో ప్రాజెక్ట్ తొలి దశతో పాటు గాంధీనగర్, ముంబయి మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు పచ్చజెండా ఊపారు. ఈ రోజు సాయంత్రం బనస్కాంత జిల్లాలో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. అలాగే, అక్కడ ప్రముఖ అంబాజీ ఆలయంలో హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గాంధీనగర్, ముంబయి మధ్య వందేభారత్ హైస్పీడ్ రైలు ప్రారంభించిన అనంతరం కాసేపు అందులో ప్రధాని ప్రయాణించారు. రైలులో ఏర్పాట్లను పరిశీలించారు. ఇక ఈ రైలు అక్టోబరు 1 నుండి అందుబాటులోకి రానుంది. ఆదివారం మినహా వారంలో ఆరు రోజులు నడవనుంది. ఈ మార్గంలో టికెట్ కనిష్ఠ ధర రూ.1385, గరిష్ఠ ధర రూ.2505గా ఉంది. కాగా దేశంలో ఇది మూడో వందే భారత్ రైలు. 2019లో తొలి వందే భారత్ రైలు దేశంలో అందుబాటులోకి వచ్చింది. న్యూఢిల్లీ, వారణాసి మార్గంలో హైస్పీడ్ రైలు ప్రారంభించగా.. న్యూఢిల్లీ, శ్రీ మాతా వైష్ణోదేవి మార్గంలో రెండో రైలును ప్రవేశపెట్టారు.



## కాబూల్‌లోని ఓ విద్యా కేంద్రం వద్ద ఆత్మాహుతి దాడి
### 23 మంది మృతి, 100మందికి గాయాలు

**కాబూల్, సెప్టెంబరు 30:** అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌లో శుక్రవారం ఓ విద్యా కేంద్రం వద్ద ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో 23 మంది చనిపోగా, 100 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య మరింత పెరగనున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు ఓవైపు యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలకు సిద్ధమవుతుండగా ఈ పేలుడు ఘటన జరిగింది. కాబూల్‌కు సమీపంలో మైనార్టీ కమ్యూనిటీకి చెందిన హజారా ప్రజలు అధికంగా ఉండే దశ్త్ ఇ బార్చి ప్రాంతంలో ఈ దాడి జరిగింది. కాజ్ హయ్యర్ ఎడ్యుకేషనల్ సెంటర్ వద్ద ఈ దాడి జరిగింది. ఆ విద్యాకేంద్రంలో యువకులు, యువతులైన విద్యార్థులు యూనివర్సిటీ ప్రవేశ పరీక్షల కోసం సిద్ధమవుతుండగా ఈ దాడి జరిగింది. ఈ దాడిని ఆ దేశ హోంశాఖ తీవ్రంగా ఖండించింది. అఫ్ఘానిస్థాన్ నుంచి అమెరికా బలగాలు వెళ్లిపోయిన తర్వాత అక్కడి తాలిబన్లు అధికారం చేపట్టారు. అప్పటి నుంచి ఆ దేశంలో షియా వర్గానికి చెందిన హజారా కమ్యూనిటీ ప్రజలపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడుల వెనుక ఐసిస్ ఉగ్రవాద సంస్థ హస్తం ఉన్నదని పరిశీలకులు చెబుతున్నారు. ఓవైపు తాలిబన్ల ప్రభుత్వం బాలికలు, యువతుల విద్యపై పలు ఆంక్షలు విధించగా, మరోవైపు ఇతర ఉగ్రసంస్థలు సున్నీయేతర మైనార్టీ ముస్లింలపై దాడులు జరుపుతున్నాయి. తాలిబన్లతోపాటు దాడులు జరుపుతున్న ఇతర ఉగ్ర సంస్థలకు చెందినవారు సున్నీలు అన్నది గమనార్హం.

## ఒక్కరోజులో కరోనా కేసులు 3938, మృతులు 9
### దేశంలో మొత్తం కరోనా బాధితులు 4,45,87,307

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, సెప్టెంబరు30:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గడిచిన 24 గంటల్లో దేశ వ్యాప్తంగా 3938 కేసులు నమోదయ్యాయి. 9 మంది మరణించారు. ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,45,87,307కి చేరిందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,40,19,095 మంది కోలుకోగా 39,583 మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు దేశంలో కరోనా కారణంగా మృతి చెందినవారి సంఖ్య 5,28,629కు చేరినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో కరోనా వైరస్ బారినపడి కోలుకుంటున్న వారి(రికవరీ రేటు) 98.73 శాతంగా ఉంది. దేశంలో కరోనా కారణంగా మరణాల రేటు 1.19శాతంగా ఉంది. మహారాష్ట్రలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 81,20,954కి చేరగా, 79,69,340 మంది వరకు కోలుకున్నారు.

## రవాణా సౌకర్యాలు పరిమితం కావచ్చు, వెంటనే బయల్దేరాలి
### రష్యాలోని అమెరికన్లను వచ్చేయమంటూ ప్రకటించిన అమెరికన్ ఎంబసి

**వాషింగ్టన్, సెప్టెంబరు 30:** ఉక్రెయిన్‌పై దాడులను తీవ్రతరం చేసేందుకు మూడు లక్షల మందితో పాక్షిక సైనిక సమీకరణకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మాస్కోలోని అమెరికా రాయబార కార్యాలయం రష్యాలో నివసిస్తోన్న అమెరికన్లను వెంటనే దేశం విడిచి వెళ్లాంటూ అమెరికా హెచ్చరించింది. రష్యా విషయంలో అనేక అంశాలు ఇప్పటికే సవాలుగా మారాయని తాజాగా పేర్కొంది. రష్యా నుంచి బయటకు వెళ్లనీయకుండా అడ్డుకుని సైనిక సేవల కోసం నిర్బంధించవచ్చు. ఈ నేపథ్యంలో ఇక్కడ నివసిస్తున్న పర్యటిస్తున్న అమెరికన్లను వెంటనే బయల్దేరాలి. రవాణా సౌకర్యాలు పరిమితంగా మారే అవకాశం ఒఉది అని అమెరికన్ ఎంబసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉండగా పుతిన్ జారీ చేసిన సైనిక సమీకరణ ఉత్తర్వులతో స్థానిక కుటుంబాలు కలవరం చెందుతున్నాయి. దీన్ని తప్పించుకునేందుకు భారీ సంఖ్యలో ప్రజలు దేశం విడిచి వెళ్లేందుకు యత్నిస్తున్నారు. దీంతో రష్యా నుంచి వెళ్లే విమానాలు ప్రయాణికులతో నిండిపోతున్నాయి. జార్జియా, ఫిన్లాండ్‌తో పాటు వీసా అవసరంలేని ఆర్మేనియా, వంటి దేశాలకు క్యూ కడుతున్నారు.




## ఉక్రెయిన్‌కు చెందిన 4 ప్రాంతాలు రష్యాలో విలీనం
### 15 శాతం భూభాగాన్ని కలిపేసుకున్న రష్యా

**మాస్కో, సెప్టెంబరు30:** ఉక్రెయిన్ నుంచి నాలుగు ప్రాంతాలను విలీనం చేసుకునేందుకు రష్యా వేసిన పథకం ఫలించింది. ఎనిమిదేళ్ల క్రితం క్రిమియాను ఆక్రమించిన తరహాలోనే ఉక్రెయిన్‌కు చెందిన 4 కీలక ప్రాంతాలను రష్యా కలిపేసుకున్నది. జపోరిజియా, ఖేర్సన్, లుహాన్స్క్, డొనెట్స్క్ ప్రాంతాలను తమ దేశంలో విలీనం చేస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ 4 ప్రాంతాలు స్వతంత్ర ప్రాంతాలని పుతిన్ పేర్కొన్నారు. దీంతో, ఉక్రెయిన్‌లోని 15 శాతం భూభాగాన్ని రష్యా కలిపేసుకున్నట్లైంది. తమ దేశాన్ని కాపాడుకునేందుకు దేనికైనా సిద్ధమని పుతిన్ స్పష్టం చేశారు. అయితే, పుతిన్ ప్రకటనను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తోసిపుచ్చారు.

## ఇరాన్ చమురు కొనుగోళ్లపై అమెరికా సీరియస్
### భారత్ కంపెనీపై మొదటిసారి యుఎస్ ట్రెజరీ ఆంక్షలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** అమెరికా ఆర్థిక శాఖ మొట్టమొదటిసారి భారత్‌కంపెనీపై ఆంక్షలు ప్రకటించింది. ఇరాన్‌నుంచి రహస్యంగా చమురు కొనుగోలుచేసిందని, ముంబయి కేంద్రంగా ఉన్న పెట్రోకెమికల్ కంపెనీ ఇరాన్‌చమురుకొనుగోలుచేసి చైనాకు పంపించిందని అమెరికా ఆరోపిస్తోంది. ముంబయిలోని కంపెనీ తిబాలాజీ ఈ కొనుగోళ్లు జరిపిందని, మొట్టమొదటి భారతీయ కంపెనీ అమెరికా ఆంక్షలకు లోను కావడం ఇదే మొదటిసారి అని భారత్ చెపుతోంది. అయితే భారత్ అమెరికా ఏకపక్షంగా ప్రకటించిన ఆంక్షలను తిరస్కరించింది. మోడీ ప్రభుత్వం ఇందుకుగాను 2019నుంచి ఇరాన్‌నుంచి చమురు దిగుమతులను నిలిపివేసింది. ఈ మొత్తం భారత్ అవసరాల్లో 11శాతంగా ఉంది. ఆంక్షలను ఎదుర్కొనకుండా ఉండేందుకు భారత్ ఇరాన్‌చమురును నిలిపివేసింది. అమెరికా ఆర్థికశాఖపరిధిలోని విదేశీ ఆస్తుల నియంత్రణ విభాగం ఇందుకు సంబంధించి ఇంటర్నేషనల్ నెట్‌వర్క్ ఆఫ్ కంపెనీలపై ఆంక్షలువిధిసప్తున్నట్లుప్రకటించింది. ఈ కంపెనీలు వందల మిలియన్ల డాలర్ల విక్రయానికి అక్రమదారుల్లో పాలుపంచుకున్నాయని, ఇరాన్ పెట్రోకెమిల్ ఉత్పత్తులను ఆగ్నేయాసియా, తూర్పు ఆసియా దేశాలకు విక్రయించి డాలర్లరూపంలో కరెన్సీని సేకరించినట్లు ఆరోపించింది. తాజా ఆంక్షలన్నీ కూడా యుఎఇ,



హాంకాంగ్, భారత్‌లలో ఉన్న అనేక ఇరాన్ బ్రోకింగ్‌కంపెనీలు, ఇతర అనుబంధ కంపెనీలపై చర్యలు తీసుకోడానికే విధించినట్లు తెలుస్తోంది. ఇరాన్ పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తులను ఇతర దేశాలకు పంపించేందుకుగానుఈ దేశాలు వెసులుబాటు కల్పించాయని భారత్‌ను కూడా అమెరికా అనుమానించింది. కొన్ని మిలియన్ డాలర్ల విలువైన ట్రిలియన్స్ బ్రోకరేజి పెట్రోకెమికల్ ఉత్పత్తులను కొనుగోలుచేసింద,ఇ, మెథనాల్ బేస్ ఆయిల్ వంటివి కొనుగోలుచేసి చైనాకు పంపించాయని అమెరికా అనుమానించింది. ఈ కంపెనీలకు అమెరికాలో ఉన్న ఆస్తులన్నింటినీ స్తంభింపచేస్తామని ఆర్తికశాఖ వెల్లడించింది. అంతేకాకుండా ఇరాన్ కొనుగోళ్లు, ఎగుమతులకు సంబంధించి డీల్‌చేసే వ్యక్తులపై చర్యలు తప్పవని కూడా హెచ్చరించింది. అమెరికా కథనం ప్రకారం ట్రిలియన్స్ అనే పెట్రోకెమికల్‌బ్రోకరేజి సంస్థ ఇరాన్‌లోని కెమికల్ ఇండస్ట్రీస్ ఇన్వెస్ట్‌మెంట్‌కంపెనీ, మిడిల్‌ఈష్ట్ కిమియా పార్స్ కో కంపెనీలనుంచి చమురు కొనుగోళ్లుచేసి వాటిని భారత్‌కు ఎగుమతిచేసిందని ఆరోపించింది. అయితే ఇందుకు సంబంధించి భారత విదేశాంగశాఖ కానీ, తిబాలజీ పెట్రోకెమికల్స్ కానీ ఎలాంటిప్రకటనచేయలేదు. భారత విదేశాంగమంత్రి జైశంకర్ తన అమెరికా పర్యటనను ముగించుకున్న తర్వాతనే అమెరికా ఈ నిర్ణయం ప్రకటించడం ఆవ్చర్యానికి గురిచేసింది.


ఇరాన్ అణు ఒప్పందాలకు సంబంధించి జెసిపిఒఎ ఒప్పందానికి అనుగుణంగా మళ్లీ వచ్చిచేరితే ఆంక్షలు తొలగి స్తామని అమెరికా విదేశాంగశాఖ ప్రకటించింది.

## 62.25 కోట్లకు పెరిగిన ప్రపంచ కరోనా బాధితులు
### 65.47 లక్షలకు చేరుకున్న మృతులు

**జెనీవా, సెప్టెంబరు 30:** ప్రపంచదేశాల్లోకరోనా కేసులు పెరుగుతున్నాయి. కొత్తకేసులు కొంతమేర తగ్గినప్పటికీ పూర్తిస్థాయిలో వ్యాప్తిని కట్టడిచేయలేదు. ప్రపంచవ్యాప్తంగా 62.25 కోట్లమందికి కరోనాసోకితే వారిలో 65.47 లక్షలమంది చనిపోయారు. మరో 39,676 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 60.23 కోట్లకుపైగా నమోదుకాగా మరో 1.36 కోట్లమందికిపైగా ఇప్పటికీ ఆసుపత్రుల్లో కొనసాగుతున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 22.72 కోట్లమందికి కరోనాసోకి వారిలో 19.20 లక్షలమంది చనిపోయారు. మరో 9324మంది పరిస్థితి విషమంగా ఉంది. రికవరీలు 22.07 కోట్లకుపైగా నమోదుకాగా మరో 46.27 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో పోరాటంచేస్తున్నారు. ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 11.63కోట్లమందికి కరోనాసోకి వారిలో 15.39 లక్షలమంది చనిపోయారు. మరో 8174 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 11.12 కోట్లకుపైగానమోదుకాగా మరో 36.45 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో పోరాటంచేస్తున్నారు. ఆసియా దేశాల్లో మొత్తం 18.97 కోట్లమందికిపైగా కరోనా బాధితులుంటే వారిలో 14.80 లక్షలమంది వైరస్‌తో బాధపడుతున్నారు. మరో 10,796 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 18.39 కోట్లకుపైగా నమోదుకాగా మరో 44.17 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.41 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 13.29 లక్షలమంది చనిపోయారు. రికవరీలు 6.23 కోట్లకుపైగా నమోదుకాగా మరో 4.11 లక్షలమంది ఇప్పటికీ మృత్యువుతోపోరాటంచేస్తున్నారు. ఆఫ్రికా దేశాల్లో1.26 కోట్లకుపైగా కరోనా బాధితులుంటే వారిలో 2,57,630 మంది చనిపోయారు. రికవరీలు 1.20 కోట్లవరకూ ఉంటే 4,01,460 మంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు.

## రెండు రోజుల్లో 15 వజ్రాలు లభ్యం
### రూ.కోటి ధర పలికే డైమండ్స్

**పన్నా, సెప్టెంబరు30:** మధ్యప్రదేశ్‌లోని బుందేల్ ఖండ్ ప్రాంతం పన్నాలో 15 వజ్రాలు దొరికాయి. రెండురోజుల వ్యవధిలోనే అక్కడి కూలీలు, స్థానికులకు ఈ వజ్రాలు దొరికాయని గనులశాఖ అధికారులు తెలిపారు. ఇవన్నీ వేర్వేరు గనుల్లో దొరికాయని తెలిపారు. వీటి మొత్తం బరువు 35.86 క్యారెట్లు. వీటిని వేలంలో అమ్మితే దాదాపు రూ.కోటి వరకూ రావొచ్చని అంచనా.



ప్రకాశ్ మజుందార్ అనే కూలీకి 3.64 క్యారెట్ల వజ్రం దొరికింది. కృష్ణకల్యాణ్‌పూర్ పాటి గనుల్లో కల్లు సోంకార్‌కు 6.81 క్యారెట్ల వజ్రం, రాజేశ్‌జెన్‌కు 2.28 క్యారెట్లు, రాహుల్ అగర్వాల్‌కు 4.35 క్యారెట్లు, రాజాబాయ్ రైక్వార్‌కు 1.77 క్యారెట్ల వజ్రాలు దొరికాయని అధికారులు తెలిపారు.

గురువారం కృష్ణకల్యాణ్‌పూర్‌పాటిలోని గనుల నుంచి పలు బరువులు కలిగిన 10 వజ్రాలను అక్కడి స్థానికులు వెలికితీశారు. 2.46 క్యారెట్ల బరువున్న ఆరు వజ్రాలు దుక్‌మన్ అహిర్వాల్ అనే వ్యక్తికి దొరికాయి. అశోక్ ఖరేకు 6.37 క్యారెట్ల బరువున్న రెండు వజ్రాలు దొరికాయి. జగన్‌జాడియాకు 4.74 క్యారెట్లు, లఖన్‌కేవత్‌కు 3.47 క్యారెట్ల వజ్రాలు లభించాయి. ఈ వజ్రాలను డైమండ్ కార్యాలయంలో డిపాజిట్ చేశారు.



## మనది పేద ప్రజలున్న ధనిక దేశం
### సంచలన వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి గడ్కరీ

**నాగ్‌పూర్, సెప్టెంబరు 30:** ప్రపంచంలో భారతదేశం అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించి ధనిక దేశంగా నిలిచినప్పటికీ ప్రజలు మాత్రం పేదలుగానే ఉన్నారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. వారంతా ఆకలి, నిరుద్యోగం, కులతత్వం, అంటరానితనం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని వ్యాఖ్యానించారు. నాగ్‌పూర్‌లో గడ్కరీ భారత్ వికాస్ పరిషత్ అనే సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. దేశంలో ధనిక, పేదల మధ్య అంతరం పెరుగుతోందని దీనికి అడ్డుకట్టవేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ మనదే. పేద జనాభా ఉన్న ధనిక దేశం. మనదేశం సంపన్నదేశమే, కానీ ప్రజలు ఆకలి, నిరుద్యోగం, పేదరికం, ద్రవ్యోల్బణం, కులతత్వం, అంటరానితనం వంటి అనేక సమస్యలతో బాధపడుతున్నారు. ఇది సమాజ పురోగమనానికి మంచిదికాదు అన్నారు. భారత సమాజంలో సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని నెలకొల్పాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో రెండు వర్గాల మధ్య అంతరం పెరిగిపోయిందన్న గడ్కరీ సామాజిక అసమానతల్లాగే ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పేద, ధనిక వర్గాల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు విద్య, ఆరోగ్యం, సేవా రంగాల్లో కృషి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశంలోని సామాజికంగానూ, విద్య, ఆరోగ్య రంగాల్లో వెనుకబడిన 124 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు ఐక్యంగా కృషి చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలు అభివృద్ధికి తార్కాణాలుగా నిలుస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో సౌకర్యాలు, అవకాశాలు తగినంతగా లేకపోవడంతో అక్కడి జనం భారీగా నగరాలకు వలస వెళుతున్నారన్నారు.

## తిరుమల బ్రహ్మోత్సవాలు



### కల్పవృక్షంపై కలియుగ వైకుంఠవాసుడు

**తిరుమల,సెప్టెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** ఉభయదేవేరులతో కలసి చేతిలో బంగారు చర్నాకోలు...మరోచేతిలో దండం ధరించి రాజమన్నార్ అలంకారంలో శ్రీమలయప్పస్వామి కల్పవృక్షవాహనంపై భక్తులకు దర్శనమిచ్చాడు. కలియుగవైకుంఠం తిరుమలలో కన్నులపండువగా ఏడుకొండల దేవునికి జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో నాల్గవరోజు శుక్రవారం ఉదయం నిత్యకైంకార్యలు పూర్తిచేసుకు న్న తరువాత ఆలయంనుంచి మలయప్పస్వామిని వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని కల్పవృక్షవాహనంపై అర్చకులు అధిరోహింపజేసి, కర్పూరహారతులిచ్చారు. స్వామివారి వాహనముందు భక్తులు గోవిందా...వేంకటరమణ గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. భూలోకంలో వృక్షాలు తాము కాసిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. కల్పవృక్షం వాంఛిత ఫలాలన్నిటినీ ప్రసాదిస్తుంది. అంతటి ప్రత్యేకత వున్న కల్పవృక్షవాహనాన్ని అధిరోహించి తిరుమాఢవీధుల్లో వైకుంఠవాసుడు కరుణించాడు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు పోకలఅశోక్‌కుమార్, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జెఇఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్ఓ నరసింహకిశోర్, సిఇ నాగేశ్వరరావు, ఆలయ డిప్యూటీ ఇఓ రమేష్‌బాబు, ఆలయ పేష్కార్ శ్రీహరి, అర్చకులు పాల్గొన్నారు.

### గరుడసేవకు చేరిన చెన్నై గొడుగులు
#### తొమ్మిది గొడుగులు అందించిన హిందూ ధర్మార్థసమితి

**తిరుమల,సెప్టెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** సాంప్రదాయాన్ని పాటిస్తూ తమిళనాడు చెన్నైలోని హిందూధర్మార్థసమితి నిర్వాహకులు ఏడుకొండల వేంకటేశ్వరునికి గరుడసేవకు అలంకరించేందుకు తొమ్మిదిగొడుగులు ఊరేగింపుగా తీసుకువచ్చి తిరుమల ఆలయానికి అందించారు. కలియుగ ప్రత్యక్షదైవమ్ ఏడు కొండల శ్రీవేంక టేశ్వరునికి జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఐదవ రోజు శనివారం రాత్రి గరుడవాహనసేవకు అలంకరించే నూతన గొడుగులు చెన్నై హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్‌ఆర్ గోపాల్‌జీ ,సమితి వ్యవస్థాపకుడు వేదాంతం, భక్త బృందంతో కలసి ఈనెల 25న గొడుగులు ఊరేగింపుగా బయలుదేరారు.



ఈ గొడుగులతో కాలినడకన శుక్రవారం ఉదయం తిరుమలకు చేరుకునే ముందు తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారిని దర్శించుకుని ఆలయానికి 2గొడుగులు సమర్పించారు. గత 17 సంవత్సరాలుగా వెంకన్నపై భక్తివిశ్వాసాలతో ఈ గొడుగులు సమర్పిస్తున్నామని గోపాల్‌జీ తెలిపారు.

శుక్రవారం ఉదయం తిరుమలలోని పెద్దజీయర్‌మఠం వద్దకు చేరుకున్న చెన్నై గొడుగులకు టిటిడి అధికారులు మంగళవాయిద్యాల నడుమ ,పూజలు చేసి స్వీకరించారు. బేడిఆంజనేయస్వామి ఆలయంవద్దనుంచి ఈ గొడుగులను టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డికి,ఇఓ ఏవి ధర్మారెడ్డికి అందజేశారు. అనంతరం ఆలయమాఢవీధుల్లో ప్రదర్శనగా తీసుకువచ్చి ఆలయంలోనికి చేర్చారు. నేటి రాత్రి జరిగే గరుడసేవలో ఈ గొడుగులు అలంకరిస్తారు.



### గోవిందుని గరుడసేవకు గోదాదేవి మాలలు

**తిరుమల,సెప్టెంబర్ 30 ప్రభాతవార్తప్రతినిధి:** సాక్షాత్తు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రియభక్తురాలు...తమిళనాడు విల్లిపుత్తూరులో కొలువైన గోదాదేవి స్వయంగా ధరించిన పూలమాలలను తిరుమలేశుని గరుడసేవలో అలంకరిస్తారు. ఈ ఆనవాయితీని పాటిస్తూ భక్తితో విల్లిపుత్తూరు ఆలయం నుంచి శుక్రవారం మధ్యాహ్నం ఈ పూలమాలలను, చిలుకలను బుట్టలో పెట్టుకుని తిరుమలకు చేరారు. తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ సెల్లదొరై, విల్లిపుత్తూరు ఆలయ ఛైర్మన్ రవిచంద్రన్ ,ఆలయ ఇఓ ముత్తురాజ,ఆలయ స్థానాచార్యులు రమేష్‌స్వామి,సుదర్శన్ మంగళవాయిద్యాల నడుమ ఊరేగంపుగా తిరుమల బేడి ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేర్చారు. ఇక్కడ పూలమాలలకు పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఓ రమేష్‌బాబు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా మాఢవీధుల మీదుగా ఆలయంలోనికి చేర్చారు. నేటి రాత్రికి జరిగే గరుడవాహనసేవలో విల్లిపుత్తూరు గోదాదేవి పూలమాలలు అలంకరిస్తారు. పెరటాసి మాసంలో గోదాదేవి ధరించిన పూలమాలలను గరుడసేవలో వినియోగించడం సంప్రదాయం. విల్లిపుత్తూరులోని శ్రీరంగమన్నార్‌స్వామి ఆలయినికి గోదాదేవి తండ్రి పెరియాళ్వార్ పుణ్యకైంకర్యాంచేసేవారని,రంగనాథునిపై భక్తికలిగిన గోదాదేవి పూలమాలలను మొదట తానుధరించిన తరువాత స్వామివారికి పంపేదని పురాణాల్లో వుంది.

## ఉక్రెయిన్‌లో మానవతా కాన్వాయ్‌పై దాడి
### 23 మంది చనిపోగా, మరో 28 మందికి గాయాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా జపోరిజియా నగరంలోని ఓ వాహన కాన్వాయ్‌పై దాడి చేయగా 23 మంది పౌరులు మరణించారు. మరో 28 మంది గాయపడ్డారు. ఈ విషయాన్ని జపోరిజియా ప్రాంతాయ గవర్నర్ ఒలెక్సాండర్ స్టారూఖ్ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రష్యా ఆక్రమిత భూభాగానికి వెళుతున్న మానవతా కాన్వాయ్‌ను రష్యా బలగాలు లక్ష్యంగా చేసుకుని ఈ దాడికి పాల్పడ్డాయని తెలిపారు. దాడిలో ధ్వంసమైన వాహనాలు, రోడ్డుపై పడి ఉన్న మృతదేహాల చిత్రాలను సోషల్‌మీడియాలో పోస్ట్‌చేశారు. రష్యా ఆక్రమిత భూభాగం నుంచి తమ బంధువులను తీసుకువచ్చేందుకు పౌరులు వెళుతున్న సమయంలో ఈ దాడి జరిగిందని స్టారుఖ్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలను రష్యాలో విలీనం చేయడానికి సిద్ధమవుతున్న తరుణంలో ఈదాడులు జరగడం గమనార్హం. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలను తాము విలీనం చేసుకుంటున్నట్లు రష్యా అధికారికంగా ప్రకటించిన విషయం తెలిసిందే. జపోరిజియా, ఖేర్సన్, లుహాన్స్క్, దొనెట్స్క్ ప్రాంతాలు రష్యాలో విలీనానికి అంగీకారం తెలిపాయని పుతిన్ సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే.

# 1.20కోట్ల ఉపాధిహామీ పనిదినాల కల్పనే లక్ష్యం

## అల్లూరి జిల్లా డ్వామా పిడి ఎన్.రమేష్ రామన్



రాజవొమ్మంగిలో పాత్రికేయులు సమావేశంలో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా డ్వామా పిడి.రమేష్‌రామన్

**రాజవొమ్మంగి, సెప్టెంబరు 30, ప్రభాతవార్త:** అల్లూరి జిల్లాలో 23.. 24సం.లో అన్ని గ్రామాల్లో 1కోటి 20 లక్షలు ఉపాధి హామీ పనిదినాలను వేతన దారులకు కల్పించే లక్ష్యంగా పనిచేస్తున్నామని అల్లూరి జిల్లా డ్వామా పిడి ఎన్. రమేష్‌రామన్ అన్నారు. శుక్రవారం రాజవొమ్మంగి మండల కేంద్రానికి వచ్చిన ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ 1కోటి 20 లక్షలు పనిదినాలకు రూ.318 కోట్లు వ్యయం కాగా వాటిలో రూ.127 కోట్లు మెటిరీయల్ ఖర్చులకు కేటాయించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2లక్షల 19వేల జాబ్‌కార్డులు ఉండగా వాటిలో 1 లక్షా 75 వేల 333 జాబ్‌కార్డుదారులు పనికి వస్తున్నారన్నారు. ప్రతీ వేతనదారునికి దినసరి వేతనంగా రూ.250లుగా పనిని కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత ఏడాది పనుల్లో 84 లక్షల పనిదినాలకు 75 లక్షల 13వేల 445 పనిదినాలను పూర్తి అయ్యాయన్నారు. జిల్లాలో సచివాలయాలు, రైతు బరోసా కేంద్రాలు అన్నీ కలిపి 349 ఉండగా, వాటిలో 62 పూర్తయినట్లు పి.డి. వెల్లడించారు. ఉపాధిహామీ ద్వారా భవనాల నిర్మాణాలకు రూ.10 కోట్లు బిల్లులు ఇవ్వడం జరిగిందని, మరో రూ.9.45 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. సెప్టెంబరు నెల 18 తేదీ వరకూ ఉపాధిహామీ వేతనదారులకు సొమ్ములను వారి ఖాతాలో జమచేయడం జరిగిందని, బకాయిలు లేవన్నారు. జిల్లాలో 4 లక్షల 25వేల 74 మంది రోజువారీ వేతనదారులు ఉపాధిహామీ పనులకు వస్తున్నారన్నారు. పోడు సాగు రైతులకు 150 పనిదినాలను ఉపాదిని కల్పించడం జరుగుతుందన్నారు. అడ్డతీగల, కొయ్యూరు, గూడెం కొత్తవీధి, రాజవొమ్మంగి మండల ఉపాధిహామీ ఏపిఓ పోస్టులు భర్తీ కావాల్సి ఉందన్నారు. జిల్లాలో 35 కి.మీ. రహదారులకు ఇరుప్రక్కల ఎవిన్యూ ప్లాంటేషన్ పెంచడం జరుగుతుందని వెల్లడించారు. గూడెం కొత్తవీధి, కొయ్యూరు, ముంచింగపుట్టు, జి.మాడుగులు మండలాల్లో పోలీసులు సమాచారం మేరకు అక్కడ గంజాయి సాగు వైపు వెళ్ళకుండా ఉపాధిహామీ పథకంలో 1,500 ఎకరాల్లో ఆరంజ్, నిమ్మ, డ్రాగన్ ఫ్రూట్, జీడిమామిడి సాగు చేయడానికి ప్రోత్సాహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో అమృత సరోవర్ అనే కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా 89 చెర్వులను గుర్తిస్తే వాటిలో 15 చెర్వుల అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందని వివరించారు.

అనంతరం ఉపాధిహామీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో పిడి మాట్లా డుతూ అక్టోబరు రెండో తేదీన అన్ని గ్రామపంచాయతీ కేంద్రాల్లో గ్రామసభలను నిర్వహించాలని, తదుపరి ప్రతీ గ్రామసభలను నిర్వహించి రాబోయే సంవత్సరానికి పనులను గుర్తించాలని ఉపాధిహామీ సిబ్బంది, పం చాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెం ట్లు, సర్వేయర్లకు సూచించారు. లబ్బర్తి పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో 800 మీటర్లు విస్తీర్ణంలో నాలుగు సిసి రోడ్లు మంజూరు చేయాలని సర్పంచ్ మిరియాల సత్యవతి, వైకాపానేత నీలి అంజిబాబు జిల్లా పిడికి అర్జీని ఇచ్చారు. ఈకార్యక్రమంలో రాజవొమ్మంగి యంపిడిఓ కోసు బాపన్నదొర, డిబిటి మేనేజర్ రాజానరేష్, ఇంజ నీరింగ్ కన్సల్టెంట్ వి.రఘు, ఉదయ్ మోషియా, ఏపిఓ నాగరాజు, జెఇ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



## ఓర్పు,అంకితభావంతో గరుడసేవలో భక్తులకు సేవలందించండి: టిటిడి ఇఓ ధర్మారెడ్డి

**తిరుమల,సెప్టెంబర్ 30ప్రభాతవార్తప్రతినిధి:** సప్తగిరుల్లో ఏడుకొండలదేవుడికి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఐదవరోజు (నేటిరాత్రి)గరుడసేవుక తరలివచ్చే అశేషసంఖ్య భక్తులకు టిటిడి ఉద్యోగులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు ఓర్పు, అంకితభావంతో సేవలందించాలని టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి పిలుపునిచ్చారు. ఉత్తమంగా భక్తులకు సేవలందించామనే అంశంపై తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవం మొత్తం ఆధారపడుతుందన్నారు. బ్రహ్మోత్సవ సమావేశం మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం గరుడసేవ ఏర్పాట్లు, భక్తులు పెరిగితే అందించాల్సిన సేవలు, విధులు నిర్వహిస్తున్న అధికారులు భక్తులతో మెలగాల్సిన తీరు,ప్రతి భక్తునికి అన్నప్రసాదాలు, తాగునీరు అందించేలా చూడాలన్నారు.సమస్య లేకుండా భక్తులుక సేవలందించినపుడే అందరూ ఆనందపడతారన్నారు.గ్యాలరీల్లో ఉన్న భక్తులకు ఉదయం నుంచి నిరంతరాయంగా శనివారం అర్థరాత్రివరకు భక్తులకు సాంబారు అన్నం, పెరుగన్నం, బిస్మిల్లా బాత్,సాయంత్రం అన్నప్రసాదాలు,తాగునీరు,మజ్జిగ అందించాలన్నారు. ప్రతిగ్యాలరీలో శ్రీవారి సేవకులు ,పారిశుధ్య సిబ్బంది అన్నప్రసాదం సిబ్బంది వుంటారని, భకులకు కావలసిన ఏర్పాట్లు చేసేందుకు ఉద్యోగులు అందుబాటులో వుం చామని ఇఓ తెలిపారు.తిరుమలలో 12వేలవాహనాలు మించితే అలిపిరిలో నిలిపివేసి పార్కింగ్ ప్రదేశాలకు పంపుతామన్నారు. భక్తులకు సంతృప్తికరంగా మూలవర్ల దర్శనం,గరుడసేవవాహన వీక్షణకల్పిస్తామన్నారు. వాహనమండపం వద్ద భక్తు లకు, ప్రముఖులకు దర్శనం కల్పించడంపై పరిశీలించారు.తనిఖీల్లో టిటిడి సివి ఎస్ఓ నరసింహాకిశోర్, ఎస్వీబిసి సిఇఓ షణ్ముఖకుమార్, ఎఫ్ఎసిఎఓ బాలాజీ, సిఇ నాగేశ్వర రావు, ఎస్ఇ2 జగదీశ్వర్‌రెడ్డి,కేటరింగ్అధికారిశాస్త్రి,డిప్యూటేషన్ అధికారులు పాల్గొన్నారు.

## సర్వభూపాలునిపై సర్వాంతర్యామి

**తిరుమల,సెప్టెంబర్ 30 ప్రభాతవార్తప్రతినిధి:** వేంకటాద్రిపై అంగరంగవైభవంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో నాల్గవరోజు శుక్రవారం రాత్రి ఉభయదేవేరులతో కలసి సర్వభూపాలవాహనంపై మలయప్పస్వామి భక్తులను కటాక్షించాడు. రాజులకు రాజు వేంకటేశ్వరుడు. సర్వభూపాలుని వాహనంగా చేసుకుని ఊరేగారు. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు, టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తిలో ప్రారంభమైన ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు



బ్యాడ్మింటన్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

### మొదటి రోజు ఉత్కంఠభరిత పోటీలు క్రీడాకారులతో మార్చ్‌ఫాస్ట్

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లాలోని పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో శుక్రవారం ఓ వైపు వర్షం కురుస్తున్నా లెక్కచేయక యువ క్రీడాకారులే క్రీడా మార్చ్' ను నిర్వహించారు. ఇక్కడ ఇంటర్‌డిస్ట్రిక్ట్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఉత్కంఠభరితంగా పోటీలు జరిగాయి. ఉదయం వర్షం కురుస్తున్నా నిర్వాహాకులు క్రీడా మార్చ్‌ను ఏర్పాటు చేసారు. స్వతహాగా క్రీడాకారుడు అయిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలి ప్రారంభించారు. ర్యాలితో పాటు ఆయన వెంటరాగా కన్నుల పండువగా 13 జిల్లాలకు చెందిన సుమారు 500 మంది క్రీడాకారులు, నాయకులు వెంటరాగా నాలుగుమాడావీధుల మీదుగా ఆర్‌పిబియస్ జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానానికి చేరింది. అక్కడ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ముఖ్య అతిధులుగా పోటీలను ప్రారంభించి శ్రీకారం చుట్టారు. మూడు రోజుల పాటు ఇక్కడ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు వివరించారు.

**13జిల్లాల నుంచి 500 మంది క్రీడాకారులు:** సుమారు 13 సంవత్సరాల తరువాత శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి 'ఇంటర్‌డిస్ట్రిక్ పోటీల' అవకాశం వచ్చింది. దాంతో ఇక్కడ పోటీలను జిల్లా అసోసియేషన్ ప్రతిష్టా త్మకంగా తీసుకున్నారు.వారి కృషికి యువకుడై శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రోత్సాహం లభించటంతో భారీ ఎత్తున ఏర్పాటు చేసారు. 13 జిల్లాల నుంచి సుమారు 500 మంది, బాలురు,బాలికలు హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరిగే పోటీలకు రాష్ట్ర స్థాయి పరిశీలకులు వచ్చారు.ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ బాల్‌బ్యాడ్మింటన్ ఇంటర్ డిస్ట్రిక్ పోటీలు నిర్వహణ శ్రీకాళహస్తికి దక్కటం తమ అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. క్రీడాకారులు చైతన్యవంతులు కావటానికి వారిలోని ప్రతిభ చాటుకోవటానికి ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పోటీల నిర్వహణకు శ్రీకాళహస్తికి అవకాశం కల్పించిన రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటికి ధన్యవాదాలు తెలిపారు.ఇక్కడ హాజరైన క్రీడాకారులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామన్నారు. కమిటి సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగిన చర్చలు,పరిశీలనల్లో శ్రీకాళహస్తిని ఎంపిక చేసిన విషయం తాము శాసనసభ్యుని దృష్టికి తెచ్చినపుడు ఆయన స్పందన తమకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు.అవసరమైతే ముఖ్యమంత్రి నుంచి కూడా సహాయం అందిస్తామనటం క్రీడల పట్ల ఆయనకు గల శ్రద్ధకు నిదర్శనం అన్నారు. పోటీల నిర్వహణకు ఏర్పాట్లకు అయన అందిస్తున్న సహకారంతోనే ఇక్కడ పోటీలు నిర్వహించగల్గుతున్నామన్నారు. అనంతరం జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లోగోను ఆవిష్క రించారు.

**మొదటి రోజు ఫలితాలు:** సీనియర్ పురుషుల పోటీల్లో ప్రకాశం జిల్లాపై కడప క్రీడాకారులు 35-28,30-35, 35-25 తో గెలిచారు.కాగా విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారులు శ్రీకాకుళంపై 35-22,35-17తో గెలిచారు.చిత్తూరుజిల్లాకు చెందిన క్రీడాకారులు గుంటూరు జిల్లాపై 35-29,37-39,35-33తో గెలిచారు. కర్నూల్‌జిల్లా క్రీడాకారులు పశ్చిమ గోదావరి జిల్లాపై 35-22,35-19తో గెలిచారు. అయితే మొదటి రోజూ జరిగిన పోటీల్లో చిత్తూరు,గుంటూరుజిల్లాల మధ్య జరిగిన పోటీ ఉత్కంఠత రేపింది.ప్రేక్షకులు కూడా అనందించారు.

**మహిళల పోటీలు:** మొదటి రోజు జరిగిన మహిళ పోటీల్లో పది జిల్లాల వారు పాల్గొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖ జిల్లాకు చెందిన క్రీడాకారిణి శ్రీకాకుళం జిల్లాపై 35-15,35-14తో గెలిచారు. గుంటూరుకు చెందిన క్రీడాకారిణిలు కడపజిల్లాపై 35-32,35-25తో సునాయాసంగా గెలుపొందారు.కృష్ణాజిల్లాకు చెందిన క్రీడాకారిణి చిత్తూరుజిల్లా క్రీడాకారిణిలుపై35-27, 35-32తో గెలిచారు.నెల్లూరుజిల్లాకు చెందిన క్రీడాకారిణలి,కర్నూలు జిల్లా క్రీడాకారిణిలపై 35-23, 35-18తో గెలిచారు.తూర్పు గోదావరి జిల్లాకు చెందిన క్రీడాకారిణిలు అనంతపురం జిల్లా క్రీడాకారిణిలుపై 35-24,35-28తో గెలుపొందినట్లు నిర్వాహాకులు వివరించారు.

## స్కందమాత దేవి అలంకారంలో ఏడుగంగమ్మల అమ్మవారు

### భవానీ భక్తులతో కిట కిట



**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో జరుగుతున్న దసరా నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకత కాబట్టి మహిళా భక్తులు శక్తి ఆలయాలకు, కొండకింద వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో, ఏడుగంగమ్మలు నిలు చు స్థలంలోని శీతలాంబ అలయం, వాసవి కన్యకారపరమేశ్వరి ఆల యాల్లో మహిళా భక్తులు సందడి చోటు చేసుకుంది.శుక్రవారం ఓ వైపు వర్షం కురుస్తున్నా లెక్క చేయక మహిళా భక్తులు భవాని మాల ధరించి పూజలకు హాజరయ్యారు.ముత్యాలమ్మగుడివీధిలోని ముత్యా లమ్మ ఆలయం, అలాగే ఏడుగంగమ్మల ఆలయంలో 'స్కందమాత ఆలంకా రం'ప్రత్యేక అలంకారాలు జరిపారు.ఇక ఆలయాల్లో నేతి దీపాలతో కళ కళ లాడింది. ఆలయాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. వచ్చిన భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం, అలాగే తీర్థ ప్రసాదాలను ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అమ్మవారి రూపాల అలంకారాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఆల యంలోనికి భక్తులు ఉదయం నుంచి వస్తుంటారు కాబట్టి మహిళా భక్తులు ప్రధాన ఆలయంలో దర్శనం చేసుకుంటున్నారు. శుక్రవారం అమ్మవారికి బంగారు చీర అలంకారం ప్రత్యేకంగా కనబడింది. ఇక బొమ్మల కొలువులో వెలసిన అమ్మ వారికి అలంకారాన్ని ఆలయ అలంకార గురుకుల్ రాజేష్,సూరిలు కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు తీర్చి దిద్దారు. కాగా ఆలయానికి అనుబంధంగా ఉన్న దుర్గమ్మ కొండపై అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకారం నిర్వహించారు.కాగా బజారువీధిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ధనలక్ష్మీ అలంకారం నిర్వహించారు. ఉత్సవమూర్తులకు శివకామసుందరి దేవి సమేత నటరాజ స్వామి అలంకారంలో దర్శనం ఇచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని దక్షిణ కాళి మాత ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారి విగ్రహం ప్రత్యేక రూపంలో ఉంటుంది. అమ్మవారు శుక్రవారం లలిత త్రిపుర సుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఇక పట్టణంలోని పానగల్‌లో వెలసిన పొన్నాలమ్మ ఆలయంలో ప్రతి రోజూ ప్రత్యేక అలంకరణలతో ఆకట్టుకుంటున్నారు. ఇక్కడ నిర్వాహకులు వచ్చిన భక్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా కొత్తపేటలోని శీతలాంబ అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకాకర్షణగా ఉంది. ప్రతిరోజూ పట్టణంలోనూ, చుట్టుపక్కల ఉన్న కళాకారులతో సంప్రదాయ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## తూర్పురాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా చంద్రశేఖర్‌రెడ్డి

**నెల్లూరు,సెప్టెంబరు30 ప్రభాతవార్త-విద్య** వైకాపా పార్టీ తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుకు చెందిన కృష్ణచైతన్య విద్యాసంస్థల అధినేత, రెడ్‌క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపిక చేశారు. ఈమేరకు ఆపార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటనను విడుదల చేసింది. కృష్ణచైతన్య విద్యాసంస్థల అధినేతగా ఆయన వందలమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అంధించి వారి అభివృద్ధికి బాటలు వేశారు.అలాగే రెడ్ క్రాస్‌చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటినుండి వందల సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ సేవా తర్పరునిగా ఖ్యాతి గాంచారు. కరోనా సమయంలో లాక్‌డౌన్‌లో చిక్కుకున్న వందలమంది నిర్వా సితులకు బోజనవసతి కల్పించటం, కోరోనా బాధి తులకు చికిత్సకోసం ఆక్సిజన్ పరికరాలు ఉచితంగా సమకూర్చటం, వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ చేయించటం, క్యాన్సర్ హాస్పిటల్ ద్వారా బాధితులకు వైద్యాన్ని తక్కువ దరలకు అందిచటంతోపాటూ మరెన్నో గుప్త దానాలు చేసి మన్ననలకు అందు కున్నారు. విద్యావంతుడు, సామాజిక,సేవా కార్య క్రమాల్లో చురుగ్గా పాల్గొనే చంద్రశేఖర్‌రెడ్డిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించటం పట్ల పలువురు పుర ప్రముఖులు, ఉపాద్యాయసంఘాల నాయు కలు, విద్యార్ధిసంఘ నాయకులు, వైకాపా పార్టీ నాయ కులు,

# మాదక ద్రవ్యాల రవాణాలో ఎపి ఫస్ట్

## టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి

**నెల్లూరు సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** వైద్యం దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు మాదక ద్రవ్యాలలో ఒక మత్తు పధార్ధం అయిన గంజాయిని రవాణ చేయడంలో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ స్ధానంలో నిలిచిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి వెల్లడించారు. శుక్రవారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పసుపు మీడియా, చంద్రబాబునాయుడులు సంస్థలు కాదని, సాక్షాత్తు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో ఆయన కింద పనిచేసే కేంద్ర నార్కోటిక్ సంస్థ ఆంధ్రా నుంచి గంజాయి రవాణా అవుతోందని వెల్లడించిందని ఇది టీడీపీ చేసిన వ్యాఖ్యలు కావన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 7లక్షల 49వేల 761కేజీలు ఏపీకి చెందిన గంజాయిని సీజ్ చేశారని ఆ సంస్థ ప్రకటించిందన్నారు. ఇందులో సీఎం జగన్‌కి మొదటి ర్యాంకు వచ్చిందని ఆనం హేళన చేశారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు మన రాష్ట్రం నుంచి రవాణా జరుగుతుంటే ముఖ్యమంత్రికి ఇది తెలియకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పక్క రాష్ట్రమైన కేసీఆర్ కూడా మన రాష్ట్రానికి ఈ గంజాయి విషయంలో పోటీకి రాలేకపోయాడన్నారు. తెలంగాణలో కేవలం 35 వేల కేజీలు మాత్రమేనన్నారు. జగన్ 2లక్షల కేజీల గంజాయిని పట్టుకున్నాడన్నారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ముంబయి థానేలలో పట్టుకున్న గంజాయి, హెరాయిన్ కూడా ఏపీ నుంచే తరలివచ్చిందని ఆ రాష్ట్ర నార్కోటిక్ బ్యూరో వెల్లడించిందన్నారు. దేశం మొత్తం మీద 26శాతం ఆంధ్రాలో గంజాయి పట్టుకున్నారు. దానిని పట్టుకున్న పోలీసులు సూపర్ అని కొంతమంది వైకాపా నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అక్రమ రవాణా బంగారు. సిల్వర్, బియ్యం కాని పట్టుకున్నా రైడ్ సమయంలో పట్టుకునేది కేవలం 5శాతం మాత్రమేనన్నారు. 95శాతం యధావిధిగా దొంగ వ్యాపారాలు జరుగుతున్నాయని అర్థం చేసుకోవచ్చన్నారు. 2లక్షల కేజీలు పోలీసులు పట్టుకున్నారంటే, 40లక్షల కేజీల రవాణా జరిగిందని వెంకటరమణారెడ్డి ఆరోపించారు. ఏపీ నుంచి కాశ్మీర్ టూ కన్యాకుమారి, ముంబయి టూ మేఘాలయ యావత్ భారతదేశానికి గంజాయిని రవాణా చేశారంటే సీఎం తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక కేజీ గంజాయి విలువ రూ.60వేలన్నారు. 40లక్షల గంజాయి విలువ మన రాష్ట్ర బడ్జెట్ కంటే ఎక్కువని దాని విలువ రూ.3లక్షల కోట్లని ఆనం వివరించారు. మూడు రాజధానులు కావాలని అన్నాడని మూడు రాజధానులు ఏర్పాటు చేస్తె తద్వారా గంజాయి వ్యాపారం ఇతర రాష్ట్రాలకు రవాణా సౌకర్యం బాగుంటుందనే ఆలోచనతోనే అనే విషయాన్ని టీడీపీ కూడా గుర్తించలేకపోయిందని అందుకు కారణం తమ పార్టీ, తమ పార్టీ నాయకులు అమాయకులు కావడమేనన్నారు. విశాఖలో లిక్కర్, ఇసుక, రిషికొండ అని అనుకున్నాం, కాని మాకు ఇప్పుడు అర్థం ఏమిటంటే పొట్టి రెడ్డి విజయసాయిరెడ్డి ఆధ్వర్యంలో ఏకధాటిగా కోట్లాది రూపాయలు గంజాయి 3లక్షల కోట్లు వ్యాపారం జరుగుతోందని తెలియకపోవడమేనన్నారు. 2లక్షల కేజీలు పట్టుకుని కాలర్ ఎగరేడం దారుణమన్నారు. రాష్ట్రంలో గ్రామ, మండల, పట్టణ, నగరాల్లో ఎక్కడా చూసినా గంజాయిని చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు మత్తుకు బానిసలు అయిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బిడ్డల తల్లిదండ్రులారా గంజాయి వాడితే కళ్ళు ఎఱ్ఱబడతాయని దానిని గుర్తుంచుకుని తమ తమ బిడ్డలను కాపాడుకోవాలని ఆయన సూచించారు. అందుకే మేము మాపార్టీ నాయకులు అమాయకులమన్నారు. ఏడాది క్రితం చంద్రబాబునాయుడు డిల్లీకి వెళ్ళి మాజీ రాష్ట్రపతి రామనాథ్ కోవింద్‌కి కూడా మాదక ద్రవ్యాల బారి నుంచి తమ రాష్ట్రాన్ని కాపాడమని కోరడం జరిగిందని తెలిపారు. నేడు మీరు జేబులు నింపుకునేందుకు ఇంత పెద్ద మొత్తంలో గంజాయి సరఫరా జరుగుతుంటే ప్రభుత్వం ఏమి చేస్తోందని ప్రశ్నించారు. వైఎస్.జగన్ కనుసన్నల్లో గంజాయి రవాణా జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఆయన పర్మిషన్‌తోనే ఇదంతా నడుస్తోందన్నారు. విశాఖలో విజయసాయిరెడ్డికి ఇదే పనని, ఆయన ఆధ్వర్యంలో జరుగుతుందని రాజకీయ నాయకుల అండదండలు లేకుండా ఇదంతా జరిగదని ఆనం వెల్లడించారు. రోజక్కా మొన్న ఒక ప్రెస్‌మీట్‌లో జుగన్' ఉన్నాడని చెప్పిందని, దానిని రోజక్క రివర్స్‌లో గన్'జ అని చదివితే గంజాయి అనే అర్థం వస్తుందని ఏద్దేవా చేశారు. జగన్ కాదని ఆయన గంజాయితో ధనాన్ని సంపాదిస్తున్నాడన్నారు.

# ఉచిత విద్యుత్‌ను నీరుగార్చేందుకే మోటార్లకు మీటర్లు

## రైతులకు అండగా ఉండి మీటర్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం

### మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజం



**నెల్లూరు సెప్టెంబర్30, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే మార్చి 31 నాటికి 18లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఏట్టి పరిస్థితుల్లో మీటర్లు బిగించి తీరుతామని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి.రామచంద్రారెడ్డి చెప్పడం సిగ్గుచేటని, ఇది పూర్తిగా సన్న, చిన్న కారు రైతులను మోసం చేయడమేనని వ్యవసాయశాఖా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ 4,500కోట్లు వెచ్చించి ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో ఉన్న 18లక్షల ఉచిత విద్యుత్ పంపుసెట్లను ఆఘమేఘాలపై రానున్న 6నెలల్లో మీటర్లు బిగిస్తాననడం ఈ ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తూ మోసం చేస్తోందన్నారు. కేవలం ప్రభుత్వ పెద్దలు మీటర్ల కొనుగోళ్ళలో వెయ్యి కోట్లుకుపైగా దోచుకుతినేందుకే హడావిడిగా మీటర్ల కొనుగోలుకు తెలతీసిందన్నారు. విమర్శించారు. తమ దోపిడీ కోసం వారు ఏంతకైనా తెగిస్తారని సోమిరెడ్డి ఆరోపించారు. రైతులకు ఉచిత విద్యుత్‌కు మీటర్లు బిగించాలని పార్లమెంటులో పాస్ చేసిన జీవోని కేంద్రం వెనిక్కి తీసుకున్నా తరువాత కూడా జగన్ మీటర్లు పెడతాననడం కేవలం కేంద్రం నుంచి మరోమూడు వేల కోట్లు అప్పులు తెచ్చుకోవడానికే అని, మీటర్ల కొనుగోలులో వెయ్యికోట్లకు పైగా దోపిడీ చెయ్యడానికి తప్ప రాష్ట్రానికి మేలు చేయడానికి కాదని ఆయన దుయ్యబట్టారు. పక్కనున్న తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలు రైతులను అన్ని రకాలుగా ఆదుకుంటుంటే, గత ఎన్నికలకు ముందు రైతులకు 12గంట నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తానని మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న జగన్ అధికారంలోకి వచ్చాక రైతులపై కక్ష కట్టాడన్నారు. రైతుల పొలాల్లో సబ్‌మెరిస్‌బుల్ మోటార్లు వచ్చిన తరువాత ఎక్కడా పంపుషెడ్లు లేవని, ఇప్పుడు మీటర్లు ఎక్కడ బిగిస్తారని ప్రశ్నించాడు. ఆరు బయట బిగించే మీటర్లు ఎక్కువ కాలం పనిచేయవని, అవి చెడిపోతే ఆ తప్పును కూడా రైతుల నెత్తిన వేసి పెనాల్టీల రూపంలో వసూలు చేస్తారనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులు అకౌంట్‌లను ప్రారంభించాలని మీటర్ల ద్వారా వచ్చిన విద్యుత్ బిల్లులను ప్రభుత్వం నేరుగా వారి అకౌంట్లలోకి జమ చేస్తుందని, దానిని వారు విద్యుత్ శాఖకు చెల్లించాలని, రైతులపై మీటర్లు పెట్టినా ఏలాంటి భారం మోపమని ప్రభుత్వం చెప్పే మాయ మాటలను నమ్మి రైతన్నలు మరోసారి మోసపోవద్దని సోమి రెడ్డి సూచించారు. బలవంతంగా రైతులతో బ్యాంక్ ఖాతాలను ఏలా పెట్టిస్తారో, మీటర్లు ఏలా పెడతారో తామూ చూస్తామని, రైతన్నలు కదిలి ముందుకు వస్తే ఈ ప్రభుత్వంపై పోరాడేందుకు టీడీపీ రైతన్నలకు అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ప్రయోగాత్మకంగా ఉచిత విద్యుత్‌కు మోటార్లు బిగించిన తరువాత 31శాతం విద్యుత్ ఆదా అయిందని మంత్రి పెద్దిరెడ్డి చెప్పడం హాస్యాస్పదంగాఉందన్నారు. 12గంటలు ఉచిత విద్యుత్ ఇస్తానని చెప్పిన జగన్ కేవలం 7గంటలే ఇస్తున్నాడన్నారు.



## టాటా టీ చక్ర గోల్డ్ ఆధ్వర్యంలో.. వేడుకగా కొండపల్లి బొమ్మల ఉత్సవం!

**తిరుపతి ప్రెస్‌క్లబ్,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** నవరాత్రి ఉత్సవాల సందర్భంగా టాటా టీ చక్ర గోల్డ్ ఆధ్వర్యంలో కొండపల్లి బొమ్మల ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు పునీత్ దాస్ తెలిపారు.రెండు తులుగు రాష్ట్రాలలో 400 సంవత్సరాలకు పైగా వారసత్వం గల గ్రామీణ జీవితం జానపద కళలు జంతువులకు ఈ కళ జీవం పోస్తుందన్నారు.కొండపల్లి బొమ్మలకు తగిన ప్రాచుర్యం కల్పించడంతో పాటు,ఈ కళను పునరుద్ధరించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు చెందిన లేపాక్షిని భాగస్వామ్యం చేసుకుని ఈ ఉత్సవం నిర్వహిస్తున్నామన్నారు.కొండపల్లి బొమ్మలను ఈకామ్ సైట్‌లో అందుబాటులో ఉంచడంతో పాటు,వాటిని కొనుగోలు చేసే విధంగా ప్రజలను ప్రోత్సహిస్తున్నామన్నారు.ప్రజలు కొనుగోలు చేసే ప్రతి కొండపల్లి బొమ్మకు టాటా టీ చక్ర గోల్డ్ ద్వారా 100 రూ॥లు కళాకారులకు అందచేస్తున్నామన్నారు.

దీంతో పాటు నవరాత్రి పండుగ ప్యాకే జీలను సైతం అందిస్తున్నామన్నారు.కావున ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఐహెచ్‌పి.రావు,తదితరులు పాల్గొన్నారు.

# సిఎం జగన్మోహన్‌రెడ్డిది చరిత్రాత్మక నిర్ణయం

## థ్యాంక్స్ గివింగ్ సభలో విసి ప్రొఫెసర్ రాజశేఖర్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సెప్టెంబరు30, ప్రభాతవార్త:** తాను చిన్నప్పటి నుంచి అంబేద్కర్ వాదినని ఆయనే తన హీరో అని ఏఎన్‌యు వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యు ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు ఏర్పాటుచేసిన థ్యాంక్స్ గివింగ్ సభలో వీసి మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి తనకు పూర్తిస్థాయి వీసిగా నియమించినందుకు సీఎం జగన్మోహన్ రెడ్డికి, గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వీసి తన ప్రసంగంలో మాట్లాడారు. కులనిర్మూలనకు ముందుంటానని స్పష్టం చేశారు. నాపై నీతిలేని పోరాటం చేశారని, ఇప్పటికీ చేస్తున్నారని, నిలువెత్తు అబద్దాన్ని ముందుకుపెట్టి పిర్యాదులు చేయడం సిగ్గుచేటన్నారు. ముసుకువేసుకుని యుద్ధం చేసి ఏమి సాధించారని ప్రత్యర్థులను ప్రశ్నించారు. ఇది తనను వేధింపులకు గురిచేయడమేఅని అన్నారు. మనమంతా యూనివర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని అసూయ, ద్వేషం ఎందుకంటూ చురకలు అంటించారు.



ఎవరిపని వాళ్ళు చేసుకుంటే ఎటువంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. ఇటువంటి వ్యవహారాలు విశ్వవిద్యాలయ ప్రతిష్టను భగం చేస్తాయని, ఇకపై విశ్వవిద్యాలయంపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేదిలేదని' హెచ్చరించారు. నాగార్జున యూనివర్సిటీలో వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు కంటే ముందే ఆంధ్రా, వెంకటేశ్వర, కాకినాడ జెఎన్‌టియు వర్సిటీల్లో ఉన్నాయన్నారు. ఇక్కడ 10ఏళ్ళ క్రితం పాలకమండలి తీసుకున్న నిర్ణయంగా గుర్తుచేశారు. దీనిని రాజకీయం చేసి తనపై బురదజల్లారని పేర్కొన్నారు. విద్యావంతులు విజ్ఞత కలిగిఉండాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో ఎవరికీ మనస్సాక్షి లేదా? భయం లేదా? ఇకపై భరించేదిలేదు. తాను గడిచిన రెండున్నరేళ్ళలో సంతృప్తికరమైన పాలన అందించానని, అభివృద్ధికి బాటలు వేశామన్నారు. యూనివర్సిటీ పాలనలో మహిళలకు ప్రాధాన్యం ఉందన్నారు. వర్సిటీ చరిత్రలో రిజిస్ట్రార్, ఓఎస్‌డి, పీజీ పరీక్షల కోఆర్డినేటర్ వంటి పోస్టులను తొలిసారిగా మహిళలకు ఇచ్చామన్నారు. ఇక్కడ సామాజిక న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. వర్సిటీలో ఇక ప్రక్షాళన చేస్తానని, ఉద్యోగులు, అధ్యాపకులు ఎవరైనా సమయపాలన పాటించాలని సూచించారు. తనకు సహకరించిన సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపి విజయసాయిరెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి మంత్రులు బొత్స సత్యన్నారాయణ, మేరుగ నాగార్జున, ఆదిమూలపు సురేష్, ఎంఎల్‌ఏలు కాసు మహేష్ రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, గోపి రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎంఎల్‌సి లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ వీసి వియన్నరావు, పలువురు ఐఏఎస్ అధికారులు, ఉన్నతాధికారులకు వీసి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బండి కరుణ, ప్రిన్సిపాల్స్ గంగాధరరావు, సిద్దయ్య, శ్రీనివాసరెడ్డి, అధికారులు నాగరాజు, మధుబాబు, హరిబాబు, చెన్నారెడ్డి, శాంతిశ్రీ, నాగకిషోర్, పి.వి.కృష్ణ, సరస్వతీ రాజు అయ్యర్, బి.నాగరాజు, సంధ్యాకోల్, సునీత, డాక్టర్ సింహాచలం, సిఇ నర్సారెడ్డి, ఏసిఇ రెడ్డి ప్రకాశరావు, ఏఇ కంకణాల సుబ్బారావు, అధ్యాపకులు, ఉద్యోగులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# దుర్గమ్మకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారె

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాలకు ఒక ఆలయం నుంచి మరో ఆలయానికి సారె అందించే సత్ సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టారు. ఈ నేపధ్యంలో శుక్రవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను విజయవాడలోని కనకదుర్గమ్మ కు సమర్పించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ సంప్రదాయాన్ని ప్రవేశ పెట్టారు. రాష్ట్రంలోని ముఖ్యమైన దేవాలయాల్లో జరిగే ఉత్సవాలకు ఇతర దేవాలయాలనుంచి సారె అందించి సమన్వయంను ప్రదర్శిస్తున్నారు. కాణిపాకంలో జరిగే వినాయక చవితి సందదర్భంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకాళహస్తి నుంచి సారె అందిస్తున్నారు. అంతేకాకుండా శ్రీశైలంతో పాటు రాష్ట్రంలో ఎంతో పేరెన్నిక గన్న వెంకటగిరిజాతరకు సారె అందించే సంప్రదాయాన్ని ఈ ఏడాది నుంచి శ్రీకాళహస్తీశ్వరాలయం ప్రారంభించింది. అంతేకాక స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఎక్కడ ధార్మిక కార్యక్రమాలు జరిగినా శ్రీకాళహస్తీశ్వరుని నుంచి సారె అందించాలని సూచించారు. ఈ మేరకు ఈ సంప్రదాయాన్ని అమలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారెను ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు బుల్లెట్‌జయశ్యాం రాయల్, మున్నా రాయల్ కొండూరు సునీత, రమాప్రభ, శ్రీలక్ష్మి, పార్టీకి చెందిన నరసింహారాజు (నంద) వెంకటసుబ్బయ్య, భాస్కర్, శ్రీదేవి తదితరులు సారెను అందించారు. ఇక ఆలయాధికారులు ఇఓ వికె సాగర్‌బాబు, డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, సూపరింటెంటెండెంట్ అయ్యన్న సుదర్శనంలు పాల్గొన్నారు. వేదపండితులు అర్థగిరి స్వామి, శ్రీనివాసశర్మ, సంగమేశ్వరస్వామి ఉన్నారు. శ్రీకాళహస్తి నుంచి ప్రత్యేకంగా వెళ్ళిన వారికి విజయవాడ ఇఓ భ్రమరాంబ సాదరస్వాగతం పలికారు. సారెను అందుకున్న ఆమె అతిథులకు అమ్మవారి దర్శనం కల్గించారు. తరువాత శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబందించి అభివృద్ధి పనులకు సంబంధించి పాలకమండలి సభ్యులతో చర్చించారు.

# పొలం సర్వే కోసం లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సర్వేయర్

**గండేపల్లి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో సెట్టి నూకరాజు అనే రైతుకు చెందిన 10 ఎకరాల 4 సెంట్ల పొలానికి చెందిన సర్వే చేసే విషయమై రూ.10వేలు డిమాండ్ చేసి రైతు నుంచి లంచం తీసుకుంటుండగా శుక్రవారం ఏసిబీ అధికారులు విలేజ్ సర్వేయర్ నాగేశ్వరరావును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు టోల్ ఫ్రీ నంబర్ 14400 ద్వారా తమకు ఫిర్యాదు రాగా తాము, తమ సిబ్బంది కాండ్రకోట సచివాలయం వద్ద నిఘా వేసి ఉండగా రైతు నుంచి డబ్బులు తీసుకున్న సమయంలో వెంటనే పట్టుకున్నట్లు ఏసిబీ అడిషనల్ ఎస్పీ సౌజన్య వెల్లడించారు. అతని చేతులు సైతం పరీక్షించగా డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారణ అయినట్లు అడిషనల్ ఎస్పి సౌజన్య చెప్పారు. ప్రభుత్వ కార్యాలయంలో ఏ పనికయినా సిబ్బంది డబ్బులు లంచంగా అడిగితే అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 14400 కి ఫోన్ ద్వారా ఫిర్యాదు చెయ్యాలని అడిషనల్ ఎస్పి సౌజన్య కోరారు.



# రైతు సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట

## ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



**జగ్గయ్యపేట, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త :** రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రత్యేక దృష్టితో పనిచేస్తున్నారని, రైతన్నల కోసం నీటిపారుదల శాఖ ద్వారా అనేక ఎత్తిపోతల పథకాలను నిర్మిస్తున్నారని ప్రభుత్వవిప్, స్థానిక ఎంఎల్ఏ సామినేని ఉదయభాను అన్నారు. శుక్రవారం ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోగల ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభోత్సవంలో ప్రభుత్వవిప్, ఉదయభానుతోపాటు జిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పల హారిక, కెడిసిసి చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, వైఎస్ఆర్‌సిపి స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ తక్కెళ్ళపాడు గ్రామంలో రూ.22 కోట్లతో దాదాపు 4,116 ఎకరాలకు సాగునీటి కల్పన జరుగుతుందని, ఎనిమిది గ్రామాల రైతుల భూములకు మేలు జరుగుతుందని అన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నేడు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. నేడు రైతన్నలకు అండగా రైతు భరోసా ద్వారా రూ.13,500లను సిఎం అందిస్తున్నారని, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుచేసి రైతన్నలను అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. పంట నష్టపోయిన రైతన్నలకు వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా ద్వారా రూ.2,977.82 కోట్ల బీమా పరిహారాన్ని సిఎం అందించారన్నారు. కాగా కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ (బాజీ), రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, జెడ్‌పిటిసి ఊట్ల నాగమణి, యేసుపోగు దేవమణి, తక్కెళ్ళపాడు గ్రామ వైసిపి నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యోగులకు జీతం తప్ప ఏమీ అందడంలేదు

## దసరాకు ఒక్క డిఏ అయినా ఇవ్వాలి - రాష్ట్ర ఎన్‌జిఓ సంఘం డిమాండ్

**నెల్లూరు కలెక్టరేట్, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** శాసనసభలో సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుందని ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగులకు సంబందించిన జీపీఎఫ్, డిఏ, సెలవుల నగదు తదితర మొత్తం రూ. 3 వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలని ఏపిఎన్‌జిఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుల బండి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇండ్లస్థలాలకై నెల్లూరుజిల్లా ఉద్యోగులు ప్రభుత్వానికి చెల్లించిన డబ్బులు ఇండ్లస్థలాలు రద్దు కావడంతో వెనక్కివచ్చిన నేపథ్యంలో ఆయా డబ్బులను తిరిగి ఉద్యోగులకు చెల్లించే ప్రక్రియ శుక్రవారం మొదలయింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు నెల్లూరుకు వచ్చిన రాష్ట్ర ఎన్‌జిఓ సంఘనేత ఎన్‌జిఓహోమ్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించిన న్యాయమైన సమస్యలను కూడా పరిష్కరించడం లేదని..వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులకు సంబంధించి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముందడుగు వేయడం లేదన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా వ్యవహరించడం లేదన్నారు. ప్రభుత్వతీరుతో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారన్న ఆయన న్యాయమైన ఆయా సమస్యలను పరిష్కరించకపోతే పోరాటానికి దిగుతామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు దాచుకున్న జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితరాలు సంవత్సరాలు గడుస్తున్నా రావడం లేదన్న బండి శ్రీనివాసరావు ఉద్యోగి చనిపోతే తక్షణమే ఇవ్వాల్సిన మట్టిఖర్చులు కూడా సకాలంలో ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు సీపీఎస్ రద్దు చేయాలన్న ఆయన పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలన్నారు. అదేవిధంగా ఒప్పంద ఉద్యోగులను అందరికీ కాలయాపన చేయకుండా వెంటనే క్రమబద్దీకరించాలన్నారు. ఇక ఆర్‌టిసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన నేపథ్యంలో వారికి రావాల్సిన రాయితీలన్నింటినీ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఉద్యోగుల ఆరోగ్యభద్రతకు సంబంధించిన ఈహెచ్ఎస్‌ను ఖచ్చితంగా అమలుచేయాలన్న ఎన్‌జిఓ రాష్ట్రసంఘ నేత న్యాయమైన ఈ డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పీఆర్‌సీ వచ్చిన తర్వాత 6 డిఏలు ప్రకటించినా వాటిలో ఇప్పటివరకు ఒక్కటి కూడా ఇవ్వలేదన్న ఆయన కేంద్ర ప్రభుత్వం తాజాగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు రెండు డిఏలను విడుదల చేసిందన్నారు. రాష్ట్రప్రభుత్వం కనీసం దసరా కానుకగా ఒక్క డిఏ అయినా ఇవ్వాలన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు జీతం తప్ప మిగిలినవేవీ అందడం లేదన్న బండి శ్రీనివాసరావు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగున్న నేపథ్యంలో జీపీఎఫ్, డిఏ, సెలవుల నగదు తదితరాలన్నీ తక్షణమే విడుదల చేయాలన్నారు.

కాగా ఈ కార్యక్రమంలో ఎన్‌జిఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీశివారెడ్డి, కార్యదర్శి మెట్టుకూరు సుబ్బారెడ్డి, జిల్లా సంఘ బాధ్యులయిన నాగిశెట్టి గిరిధర్, లక్కాకుల పెంచలయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, గొలగమూడి రమేష్,

ఈదూరు కరుణమ్మ, నల్లగొండ్ల మదుబాబు, కడెం రాజేంద్రప్రసాద్, ఈదూరు విజయకుమార్, తుమ్మల చంద్రశేఖర్, ఎంవీసువర్ణకుమారి, కే.స్వర్ణలత, రామకృష్ణారెడ్డి, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఏసి బస్సులకు విశేష స్పందన

## డిపిటిఓ చెంగల్‌రెడ్డి

**తిరుపతి ప్రెస్‌క్లబ్,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** శుక్రవారం నుండి తిరుపతి-తిరుమల మధ్య ప్రవేశ పెట్టిన 3 విద్యుత్ ఏసి బస్సులకు ప్రయాణీకుల నుండి విశేష స్పందన వచ్చిందని ఏపిఎస్ఆర్టీసీ తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి తిమ్మాడి చెంగల్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటసారిగా తిరుపతికి 10 విద్యుత్ బస్సులు రావడం జరిగిందన్నారు. వీటిని తిరుమల-తిరుపతి మధ్య నడపడానికి సిద్ధం చేశామన్నారు. ఇందులో మొదటగా మూడు బస్సులను ఘాట్ రోడ్డులో నడుపుతున్నామన్నారు. శుక్రవారం ఉదయం రైల్వేస్టేషన్ పాయింట్ వద్ద బస్సులు ఉంచగానే ప్రయాణీకులు విద్యుత్ ఏసీ బస్సులో ప్రయాణించాలనే ఆసక్తితో బస్సులు ఎక్కడంతో కొంత సేపటికే అన్ని సీట్లు నిండిపోయాయన్నారు. మామూలు బస్సుల్లో తిరుమలకు పెద్దలకు 90 రూ॥లు, పిల్లలకు 60 రూ॥లు ఉండగా, ఈ విద్యుత్ బస్సుల్లో పెద్దలకు 110 రూ॥లు, పిల్లలకు 90 రూ॥లుగా టికెట్ ధర నిర్ణయించామన్నారు. 20 రూ॥లు తేడా ఉన్నా భక్తులు విద్యుత్ బస్సుల్లో ఉన్న అత్యాధునిక సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రయాణం చేయడానికి ఆసక్తి కనబరచడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం ఈ బస్సులు రైల్వేస్టేషన్ నుండి లీలామహల్ మీదుగా అలిపిరి బాలాజి బస్‌స్టేషన్ చేరుకుని, బస్సులో సీట్లు నిండిన అనంతరం తిరుమలకు బయలుదేరుతాయని అన్నారు. మిగిలిన 7 బస్సులు కూడా ఒకటి రెండు రోజుల్లో భక్తులకు అందుబాటులోకి వస్తాయని ఆయన వివరించారు. తాను భక్తులను విద్యుత్ బస్సుల సౌకర్యాలపై వారి అభిప్రాయం అడగ్గా వారు వంద శాతం సంతృప్తి వ్యక్తం చేయడం ఆనందంగా ఉందన్నారు.

# కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం!

## మాజీ కేంద్ర మంత్రి డా॥చింతా మోహన్

**తిరుపతి ప్రెస్‌క్లబ్,సెప్టెంబర్ 30 ప్రభాతవార్త:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో అటు కేంద్రంలోను, ఇటు ఆంధ్రప్రదేశ్‌లోను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు డా॥చింతా మోహన్ జోస్యం చెప్పారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గల రాజీవ్‌గాంధీ విగ్రహం ముందు ఏఐసిసి అధ్యక్షుడిగా మల్లికార్జున్ ఖర్గే నియమితులయిన సందర్భాన్ని పురస్కరించుకుని డా॥చింతా మోహన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయన్నారు. ఎస్సీ వర్గానికి చెందిన మల్లికార్జున్ ఖర్గే ఏఐసిసి అధ్యక్షుడు కావడం దేశంలోని దళితులందరికీ గర్వకారణమన్నారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలో 300 సీట్లతో, రాష్ట్రంలో 150 సీట్లతో గెలిచి కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందన్నారు. 1960లో జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో ఎస్సీ వర్గానికి చెందిన దామోదరం సంజీవయ్య అఃఇల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యారు. ఇప్పుడు ఆయన మనవడు రాహుల్ గాంధీ హయాంలో మల్లికార్జున్ ఖర్గేని ఏఐసిసి అధ్యక్షుడిని చేయడం విప్లవాత్మక నిర్ణయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, కోనేటి శాంతి యాదవ్, మించల తేజోవతి, సమీన్ ఉల్లా, వెంకటేష్, ఆలీ తదితరులు పాల్గొన్నారు.





అమ్మవారికి పూజలు చేస్తున్న ఎం ఆర్‌పిఎ జగన్మోహనరావు

# సత్యమ్మ తల్లి ఆలయంలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

**విజయవాడ,సెప్టెంబరు30,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ స్థాయిలో కాశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు కులమతాలకీతంగా ఆరాధింపబడున్న అమ్మవారు శ్రీ సత్యమ్మతల్లి.. ఈ అమ్మవారి ఆలయంలో దసరా సందర్భంగా శరన్నావరాత్ర ఉత్సవాలు జరుగుతాయి. జాతీయ రహదారిపై వెళ్ళే వారు మతాలకతీతంగా అమ్మవారికి దర్శించుకుంటారు. దాదాపు నాలుగువందల ఏండ్ల క్రితం అమ్మవారు ఇక్కడకు ఎక్కడ నుంచి వచ్చారో తెలియదుగాని. బాటసారు ఉచితంగా భోజన వసతి కల్పించేవారంటా! అర్ధరాత్రి లేపినా గరికపచ్చడితో అన్న పెట్టారు. కాలగతిలో అమ్మవారు ఆకస్మికంగా అదృశ్యమై గ్రామంలో శిల ప్రతిమగా నిలిచారు.




# 'టాప్ ఇంపాక్ట్ క్రియేటర్' అవార్డును స్వీకరించిన గ్రేటర్

## కేంద్ర మంత్రి చేతులుమీదుగా అందుకున్న జివిఎంసి కమిషనర్ రాజాబాబు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త** స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రతిష్టాత్మకమైన ఇండియన్ స్వచ్ఛతా లీగ్(ఐఎస్ఎల్) కేటగిరిలో టాప్ ఇంపాక్ట్ క్రియేటర్' అవార్డును జీవీఎంసీ దక్కించుకుంది. దేశవ్యాప్తంగా వున్న 1850 నగరాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విశాఖ నగరానికి మొదటి స్థానం లభించింది. ఈ అవార్డును శుక్రవారం ఢిల్లీలోని తాల్కటోరా ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ సంస్థ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి నుంచి జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజాబాబు మాట్లాడుతూ, ఇండియన్ స్వచ్ఛతా లీగ్ అవార్డు దక్కడం చాలా సంతోషంగా వుందన్నారు. ఎంతో బాధ్యతను పెంచుతాయని, జీవీఎంసీ స్వచ్ఛతా లీగ్‌లో ప్రతిష్టాత్మకమైనో టాప్ ఇంపాక్ట్ క్రియేటర్' అవార్డు పొందడం వెనుక జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గత కమిషనర్ లక్ష్మీశ, పాలకమండలి, అధికారులు, సిబ్బందితో పాటు నగర పౌరులు, ఆర్‌డబ్ల్యూఎస్, నేవల్ పోలీసు, విద్యా సంస్థలు, ఎన్‌జిఓ సంస్థల కృషి వుందని వివరించారు. కాగా, 1850 నగరాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో విశాఖ నగరం మొదటి స్థానం పొందడం శుభపరిణామమని ఆయన పేర్కొన్నారు.

# బొలోరా వ్యాన్‌లో 552 కిలోల గంజాయి స్వాధీనం

**గండేపల్లి, సెప్టెంబర్ 30, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన గండేపల్లి గ్రామ శివారులో బోలోరా వ్యాన్‌లో తరలిస్తున్న 23 గోనె సంచుల్లో గంజాయి సుమారు రూ.16,56,000 లక్షలు విలువ చేసే 552 కిలోల గంజాయిని అదుపులోకి తీసుకున్నట్లు జగ్గంపేట సిఐ సూర్య అప్పారావు తెలిపారు. జిల్లా ఎస్పి ఎం.రవీంద్రనాథ్ బాబు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి జిల్లాలో గంజాయి రవాణా అక్రమాలపై పోలీసులు విస్తృతంగా దాడులు చేసి గంజాయి మూకలను అరెస్టు చెయ్యడం జరుగుతుందని సిఐ బి సూర్య అప్పారావు తెలిపారు. జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు, గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్‌కు అందిన ముందస్తు సమాచారం మేరకు గండేపల్లి ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఒక బోలోరా ఆగి గంజాయి ఉందన్న సమాచారంపై తహసీల్దార్ చిన్నారావు మరియు మధ్య వర్తులతో ఆ ప్రదేశం వద్దకు వెళ్లగా అక్కడ వ్యాన్ నెంబర్ ఏపి జీరో ఫైవ్ టి ఎల్ 1158 వ్యాన్ ఉంది. ఆ వ్యాన్‌ను సోదా చెయ్యగా పచ్చి అరటి గెలల లోడు కింద కప్పబడి 23 గోనె సంచులలో గంజాయి బస్తాలు లోడ్ చేసి గుట్టుగా రవాణా చేస్తున్నారని సిఐ తెలిపారు. చుట్టుపక్కల అనుమానితుల గురించి వెతకగా ఎటువంటి ఆచూకీ తెలియలేదని తెలిపారు. గండేపల్లి ఎస్సై గణేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నేటి నుంచి కొత్త రైల్వే టైం టేబుల్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 30 ప్రభాతవార్త :** ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో కొత్త రైల్వేటైం టేబుల్ శనివారం నుంచి అమల్లోకి రానుంది. ఈ మేరకు శుక్రవారం సంబంధిత అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 77వ ఈ నూతన రైల్వే టైం టేబుల్‌లో పలు నూతన రైళ్లను ప్రవేశ పెట్టడంతోపాటు, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చడం, మరికొన్ని రైళ్లను దారిమళ్లించడం, రైళ్ల వేగాన్ని పెంచడం, గమ్యస్థానాలను పొడిగించడం, గతంలో తిరిగిన పలు పాసింజర్ రైళ్లను ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా అప్‌గ్రేడ్ చేయడం, పలు రైళ్ల ఫ్రీ క్వెన్సీ నుంచి పెంచడం, పలు రైళ్లకు ప్రయోగాత్మకంగా హాల్టింగ్ సదుపాయం కల్పించడం, కొన్ని రైళ్లకు సంబంధించిన నెంబర్‌లను మార్చారు. ప్రయాణికులు తమకు కావాల్సిన సమాచారాన్ని 139 నెంబర్‌కు ఫోన్ చేసి గాని, ఆయా రైల్వే స్టేషన్లలో సంబంధిత అధికారులతో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని రైల్వే వర్గాలు తెలిపాయి.

# రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో చిత్తూరు జిల్లాకు ఛాంపియన్‌షిప్

**రేణిగుంట, సెప్టెంబరు 30 ప్రభాతవార్త:** రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్లు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించినట్లు ప్రధానాచార్యులు విష్ణువర్ధని, పీడీ రేఖరాణి సంయుక్తంగా తెలిపారు. రేణిగుంట బాలికలు ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ కమిటీ నిర్వహించిన రాష్ట్ర రెండవ సీనియర్ గ్రాప్లింగ్ కుస్తీ పోటీల్లో 625 పాయింట్లు చిత్తూరు జట్టు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించింది. ద్వితీయ స్థానం అనంతపురం, తృతీయ స్థానం నెల్లూరు జట్టు కేవలం చేసుకున్నాయి. బంగారు రజిత పథకాలు సాధించిన 42 మందిని జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు ఎంపిక చేశారు. వీరు వచ్చే నెల 24వ తేదీ నుంచి 27 తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో జరిగే జాతీయ కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రాబ్లింగ్ కమిటీ సభ్యులు ఎం.సురేంద్రరెడ్డి, మారుతి మోహన్‌రెడ్డి, మునిబాబు, సాయి సుమతి, పవన్, మణికంఠ, హేమంత్‌కుమార్, మురళి, చిరంజీవి, రోహిణి తదితరులు పాల్గొన్నారు.



ఆట

# టి20 ప్రపంచకప్ విజేతకు ప్రైజ్‌మనీ రూ.13కోట్లు!




**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా వేదికగా అక్టోబరు 16నుంచి టి20 ప్రపంచకప్ టోర్నీ సందడిచేస్తుంది. ఈ మెగా టోర్నీపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. మరోవైపు ఐసిసి ఈ టోర్నీ విజేతకు ప్రైజ్‌మనీకింద ఎంతమొత్తం దక్కుతుందోకూడా వెల్లడించింది. ఐసిసి టి20 ప్రపంచకప్ 2022 టోర్నీ విజత జట్టుకు ప్రైజ్‌మనీకింద 1.6 మిలియన్ డాలర్లు అందుతాయి. అంటే భారతీయ కరెన్సీలో సుమారు 13కోట్ల రూపాయలు. రన్నరప్ టీమ్‌కు ఎనిమిది లక్షల డాలర్లు అంటే 6.5 కోట్లు అందచేస్తారు. ఇక సెమిఫైనల్ విజేతలు, గ్రూపుదశలో విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీ కూడా వెల్లడించింది. ఈ టోర్నీలో అన్ని జట్లకు ప్రైజ్ మనీ అందించేందుకు ఐసిసిమొత్తం 5.6 మిలియన్ డారల్లు అంటే 45.68కోట్లు ఖర్చుచేస్తోంది. సెమి ఫైనల్‌లో ఓటమి పాలయిన రెండుజట్లకు నాలుగు లక్షల డాలర్లు అంటే 3.25కోట్లు ఇస్తారు. సూపర్ 12దశనుంచి వైదొలిగిన ఎనిమిది జట్లకు 70వేల డాలర్లు అందిస్తారు. టోర్నీ మొదైలన నాటినుంచి కిందటి ఏడాది తరహాలోనే ఒక్కోజట్టుకు ఒక్కో విజయానికి 40 వేల డాలర్లుచొప్పున అంటే 32 లక్షలచొప్పునప్రైజ్‌మనీ ఇస్తారు. సూపర్12 దశలో ఇలాంటివి మొత్తం 30 మ్యాచ్‌లుంటాయి.

ఈసారి పొట్టిక్రికెట్ ప్రపంచకప్ కోసం 16 టీమ్‌లు పోటీపడుతున్నాయి. భారత్‌తో పాటు అస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌జట్లు నేరుగా సూపర్12 దశకు నామినేట్ అయ్యాయి. మిగిలిన నాలుగుస్థానాలకోసం మరో 8 జట్లు శ్రీలంక వెస్టిండీస్, నమీబియా, నెదర్లాండ్, యుఎఇ, స్కాట్లాండ్, ఐర్లాండ్, జింబాబ్వేలు పోటీపడతాయి. ఈ టీమ్‌లమధ్య జరిగేమ్యాచ్‌ల్లో విజేతలుగా నిలిచిన నాలుగుజట్లు సూపర్12దశకు అర్హత సాధిస్తాయి. ఆస్ట్రేలియా వేదికగా 2ఈనెల 16నుంచి నవంబరు 13వరకూ ఈ మెగ ఆటోర్నీ జరుగుతుంది.



## రోహిత్‌కు అభిమాని పాదాభివందనం

**తిరువనంతపురం:** నగరంలోని గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ గ్రౌండ్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టి20లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్‌శర్మ ఫ్యాన్ ఒకరు భద్రతా సిబ్బందికళ్లుగప్పి మైదానంలోకి పరుగెత్తుకొచ్చాడు. నేరుగా రోహిత్‌శర్మవద్దకు వచ్చి పాదాభివందనంచేసాడు. అనంతరం రోహిత్‌ను రిక్వెస్ట్‌చేసి సెల్ఫీ తీసుకున్నాడు. ఇందుకు సంబంధించిన ఫోటోలు వైరల్‌అయ్యాయి. దక్షిణాఫ్రికాపై టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకున్న రోహిత్ అప్పుడే క్రీజులోకి అడుగుపెడుతుండగా ఈ ఘటనజరిగింది. ఈ పరిణామానికి రోహిత్‌సహా ఆటగాళ్లంతా ఆశ్చర్యపోయారు. సదరు అభిమాని చెప్పులు లేకుండా మైదానంలోకి రావడం గమనార్హం. తన దేవుడిని కలిసి కాళ్ల మొక్కేందుకు ఆ ఫ్యాన్ చెప్పులు లేకుండా మైదానంలోకి వచ్చాడు చూసారా అది నిజమైన భక్తిఅంటూ నెటిజన్లు పోస్టులు వెల్లువెత్తించారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆ అభిమానిని వెంటనే అక్కడినుంచి పంపించివేసారు. మైదానంచుట్టూ రోహిత్‌శర్మ, కోహ్లీల భారీ కటౌట్లను అభిమానులు ఏర్పాటుచేసారు.



## నేటినుంచే మహిళల ఆసియాకప్ షురూ

### బంగ్లాదేశ్‌లో తొలిరోజు శ్రీలంకతో భారత్ పోటీ

**న్యూఢిల్లీ:** భారత మహిళల టి20 అసియా క్రికెట్ కప్ నాలుగో ఎడిషన్ ఝశనివారంనుంచే బంగ్లాదేశ్‌లోప్రారంభం అవుతోంది. ఈ టోర్నీలో మొత్తం ఏడుజట్లు పోటీపడుతున్నాయి. రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో జరుగుతుంది. ప్రతిజట్టు ఆరుమ్యాచ్‌లు ఆడుతుంది. మొదటినాలుగుజట్లు సెమిఫైనల్‌కు వస్తాయి. లీగ్‌దశ అక్టోబరు 11వరకూ కొనసాగుతుంది. సెమీఫైనల్స్ అక్టోబరు 13, ఫైనల్ మ్యాచ్ అక్టోబరు 15న జరుగుతుంది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన బంగ్లాదేశ్ టోర్నమెంట్ తొలిమ్యాచ్‌లో థాయిలాండ్‌తో ఆడుతుంది. అదేరోజు భారత్ రెండోమ్యాచ్‌లో శ్రీలంకతో పోటీపడుతుంది. ఈ టోర్నీలో భారత్ టైటిల్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతుంది. టీమిండియా వుమన్ జట్టులో కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్‌కౌర్, వైస్ కెప్టెన్‌గా స్మృతి మంధాన, దీప్తిశర్మ, షెఫాలీవర్మ, జెమీమా రోడ్రిగ్స్, సబ్బినేని మేఘన, రిచాఘోష్ వికెట్‌కీపర్, స్నేహరాణా, దయాళన్ హేమలత, మేఘనాసింగ్, రేణుకా ఠాకూర్, పూజావస్త్రాకార్, రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్, కెపినవ్‌గిరేలుంటారు. రిజర్వు ప్లేయర్లుగా తానియా సప్నాభాటియా, సిమ్రాన్‌దిల్ బహాదూర్‌లుంటారు.

# వాణిజ్యం

## రెపోరేట్లను పెంచిన ఆర్‌బిఐ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేసేందుకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లను మరోసారి పెంచింది. రెపో రేటును మరో 0.50 శాతం పెంచి, 5.90 శాతానికి చేరింది. ఈ మేరకు ఈ నెల 28-29ల్లో జరిగిన ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ శుక్రవారం వెల్లడించారు. మేలో 0.40 శాతం, జూన్, ఆగస్టులో 0.50 శాతం చొప్పున, తాజాగా మరో 0.50 శాతం పెంచడంతో 4 నెలల వ్యవధిలోనే రెపోరేటు 1.90 శాతం పెరిగింది. ప్రస్తుతం అన్ని బ్యాంకులూ ఎక్స్ టర్నల్ బెంచ్ మార్కు గా రెపోరేటును తీసుకుంటున్నాయి. దీంతో బ్యాంకులు వడ్డీ రేట్లను పెంచేందుకు ఏ మాత్రం ఆలస్యం చేయవు. అంటే ఏప్రిల్‌లో 6.5-7శాతం వడ్డీరేటుకు లభించిన రుణం, ఇప్పుడు 8.5శాతానికి మించే అవకాశాలు న్నాయి. దీని వల్ల ఇప్పటికే రుణాలు తీసుకున్న వారి నెలవారీ వాయిదా మొత్తం/రుణం చెల్లింపు కాలం పెరుగుతుంది. బ్యాంకు రుణం తీసుకుని, కొత్తగా ఇల్లు కొనాలని అనుకునే వారికీ ఇబ్బందే. ఆదాయానికి తగ్గట్లు ఇచ్చే రుణ మొత్తం తగ్గుతుంది. దీంతో చేతి నుంచి అధికంగా మార్జిన్ మనీ చెల్లించాల్సి వస్తుంది. ఇల్లు, వాహనం, వ్యక్తిగత రుణాలు తీసుకున్న వారి ఇఎంఐ మరింత పెరుగుతుంది. దీంతో నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం పడి సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ఈ యేడాది మే నెల నుంచి ఇప్పటివరకు మూడు దఫాల్లో మొత్తం 140 బేసిస్ పాయింట్ల మేర రేపో రేటును ఆర్‌బిఐ పెంచింది. చివరి రెండుసార్లు 50 బేసిస్ పాయింట్ల చొప్పు సవరించింది. ద్రవ్యోల్బణ నియంత్రణ కోసమే ఈ చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌బిఐ తెలిపింది.

## నేటి నుంచే 5జి సేవలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 30:** దేశంలో ఎప్పు డెప్పుడా అని ఎదురుచూస్తున్న 5జి సేవలు అందుబాటులోకి వచ్చే సమయం ఆసన్నమైంది. శనివారం ప్రధాని నరేంద్ర మోడీ చేతులు మీదుగా ఈ సేవలు ప్రారం భం కానున్నా యి. ఎంపిక చేసిన నగరాల్లో తొలుత ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దశలవారీగా దేశ వ్యాప్తంగా ఈ సేవలు విస్తరించ నున్నాయి. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నిర్వహించే ఆరో విడత ఇండియన్ మొబైల్ కాంగ్రెస్, 2022 సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ ఉదయం 10 గంటలకు 5జి సేవలను ప్రారంభిస్తారని అధికారిక ప్రకటన వెలువడింది. అల్ట్రా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలతో పాటు కొత్త అవకాశాలు, ప్రయోజనాలు 5జి ద్వారా లభించనున్నాయి. 4జితో పోలిస్తే అత్యంత వేగవంతమైన డేటా సేవలు 5జి ద్వారా లభించనున్నాయి. ఫుల్ లెంగ్త్ హై క్వాలిటీ విడియో లేదా సినిమాను కొన్ని సెకన్ల వ్యవధిలోనే డౌన్‌లోడ్ చేసు కోవడం వీలవు తుంది. ఇటీవల నిర్వహించిన వేలం ప్రక్రియలో ముకేష్ అంబానీ నేతృ త్వంలోని జియో రూ.88,078 కోట్ల విలువైన స్పెక్ట్రమ్‌ను దక్కించుకుంది. సునీల్ మిట్టల్ నేతృత్వంలోని ఎయిర్ టెల్ రూ.43,084 కోట్లు, వొడాఫోన్ ఐడియా 18,799 కోట్ల రూపా యలు విలువైన స్పెక్ట్రమ్‌ను కొనుగోలు చేశాయి.

## రూపాయి పతనం కట్టడికి సుంకాల పెంపు!

**ముంబై, సెప్టెంబరు 30:** కరెంటు ఖాతాలోటు కట్టడికి ప్రభుత్వం ఇపుడు అత్యవసరం కాని దిగుమతులపై కొన్ని సుంకాలను పెంచేందుకు నిర్ణయించింది. పతనం అవుతున్న రూపాయి కట్టడికి కూడా ఈ చర్యలు తప్పవని ప్రభుత్వం భావిస్తోంది. అమెరికా ఫెడ్ రిజర్వు మానిటరీ పాలసీని కొంత మేర కఠినంచేసింది. కరెంటుఖాతా లోటు కూడా దీనివల్ల రెట్టింపు అయ్యే అవకాశం ఉందని, దీనివల్ల భారతీయ కరెన్సీపై మరింత ప్రభావం పడుతుందని కేంద్రం భావిస్తోంది. అధికార యంత్రాంగం ఇప్పటికే కొన్ని ఎంపికచేసిన ఉత్పత్తులపై సుంకాలు పెంచేం దుకు నిర్ణయించారు. అయితే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. చమురు తర్వాత భారత్‌కు దిగుమతి అవుతున్న అత్యధిక ఉత్పత్తుల్లో ఎలక్ట్రానిక్స్ రెండోదిగా ఉంటోంది. భారత్ కరెంటుఖాతా లోటు స్థూల దేశీయోత్పత్తిలో 2.8 శాతంగా ఉంది. ఈ ఆర్థిక సంవత్స రం తొలి త్రైమాసికంలో కరెంటుఖాతా లోటు అంచనాలకు అనుగు ణంగానే ఉంది. వాణిజ్య లోటు 68.6 బిలియన్ డాలర్ల వరకూ నమోదు కావడమే ఇందుకు కారణ మని నిపుణులు అంచనా వేస్తున్నారు. బంగారంపై దిగుమతి సుంకం 10.75 నుంచి 15శాతానికి పెంచారు. దిగుమతులపైనే సుంకాలు వేయడంవల్ల మారకం విలువల్లో మార్పులురావని, అలాగే కరెంటు ఖాతా లోటు కూడా కట్టడి చేస్తామనుకో వడం భ్రమేనని హెచ్చరిస్తున్నారు.

### వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870

| (రూ. కిలోకు) | (Rs. Per Kg) | |
|---|---|---|
| ఫామ్‌గేట్ | (Farmgate) | 103 |
| డ్రెస్డ్ | (Dressed) | 125 |
| విత్ స్కిన్ | (with skin) | 181 |
| స్కిన్‌లెస్ | (Skinless) | 206 |




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 3rd Mile Stone Renigunta Road, Tirupati-517506 Ph No :2238770, Fax:08772238790, RNI NO.64860/96, Editor: *Damerla Sai Baba, * Responsible for Selection of News under the PRB Act, Regd.:No.H/H.T.P/57, Postal Licence/TRP104/2006/2008 Surcharge:Delhi:40